RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:62 26-8-2025 మంగళవారం ఎడిటర్ :మద్ది పవిత్ర పేజీలు : 8 వెల 4 /

## ఒత్తిడి పెరిగినా భరిస్తాం..




అహ్మదాబాద్, ఆగస్టు 25(టుడే విదుర): 'మనపై ఒత్తిడి పెరుగొచ్చు. కానీ, మనం దాన్ని భరిద్దాం' అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి భారత్ వస్తువులపై అమెరికా 50% సుంకాలు అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ప్రధాని మోదీ సోమవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో పలు పథకాలను ప్రారంభించి.. రోడ్‌షో నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. రైతులు, పశు పోషకులు, చిన్న పారిశ్రామికవేత్తల ప్రయోజనాల విషయమై రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎవరి పేర్లు ప్రస్తావించకుండానే ఆర్థిక ప్రయోజనాల చుట్టూ ప్రపంచ రాజకీయాలు తిరుగుతున్నాయన్నారు. రక్షణ, శక్తికి మారుపేరుగా నిలిచిన 'సుదర్శన చక్రధారి శ్రీకృష్ణుడు.. జాతీయోద్యమంలో రాట్నంపై నూలు వడికి స్వదేశీ దుస్తులు వాడాలన్న మహాత్మాగాంధీ బాటలో భారత్ సాధికారత సాధించిందని మోదీ చెప్పారు.

## మహిళల సహకారంతో స్త్రీశక్తి గ్రాండ్ సక్సెస్



**విద్యార్థినులకు బస్‌పాసుల శ్రమ తప్పించాం**
**మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం తీసుకొచ్చాం**
**ఉచిత బస్సులకు త్వరలో లైవ్ ట్రాకింగ్**
**ఆర్టీసీపై సమీక్షలో సీఎం చంద్రబాబు**

అమరావతి, ఆగస్టు 25(టుడే విదుర): మహిళల సహకారంతో స్త్రీశక్తి పథకం గ్రాండ్ సక్సెస్ అయిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. పథకం అమలుపై సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆర్టీసీ అధికారులతో సీఎం సమీక్షించారు. ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్), బస్సుల్లో సీట్ల కోసం పోటీ పడే క్రమంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా వంటి అంశాలపై ఆరా తీశారు. గతంలో ఆక్యుపెన్సీ రేషియో 68 నుంచి 70 శాతంగా ఉండేదని.. ఇప్పుడు 60 డిపోల పరిధిలో తిరిగే బస్సుల్లో 100 శాతం ఆక్యుపెన్సీ రేషియో పెరిగిందని అధికారులు బదులిచ్చారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం సందర్భంగా సీట్ల కోసం ఇబ్బందులు.. గందరగోళం వంటి సంఘటనలు తలెత్తడం లేదని ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ఉచిత బస్సులను మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారని, అవసరమైన మేరకే ప్రయాణాలు చేస్తున్నారని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు వివరించారు. సీఎం మాట్లాడుతూ.. 'ఏపీ మహిళల్లో చైతన్యం ఎక్కువ. ప్రభుత్వం ఎలాంటి పథకాలను తెచ్చినా.. వాటిని సద్వినియోగం చేసుకుంటారు. ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందుతారు. అందుకే ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా ఉన్నప్పటి నుంచీ మహిళలకు ప్రత్యేక పథకాలు ఇవ్వడానికి ఆసక్తి చూపించాను. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తే.. ఇప్పుడు స్త్రీ శక్తి ద్వారా వారికి ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించాం. ఒకప్పుడు బాలికా విద్యను ప్రోత్సహించేందుకు సైకిళ్లు ఇచ్చాం. ఇప్పుడు విద్యార్థినులు, మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం కానుకగా ఇచ్చాం. దీని వల్ల బస్ పాసుల కోసం క్యూ లైన్లల్లో నిల్చొనే శ్రమ తప్పింది. ఆర్టీసీ బస్సుల్లో వెళ్తే భద్రత కూడా ఉంటుంది' అని అన్నారు.

## జలాశయాలు కళకళ

**సమర్థ నీటి యాజమాన్య నిర్వహణతో సత్ఫలితాలు: సీఎం**
**హంద్రీ-నీవా విస్తరణతో కుప్పం చేరిన కృష్ణా జలాలు**
**శ్రీశైలం నుంచి 738 కి.మీ ప్రయాణం**
**సీఎం చంద్రబాబు సమీక్ష**



అమరావతి, ఆగస్టు 25(టుడే విదుర): రాష్ట్రంలోని జలాశయాలకు జలకళ వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. సమర్థ నీటి యాజమాన్య నిర్వహణతో సత్ఫలితాలు సాధించామన్నారు. హంద్రీ-నీవా కాలువ విస్తరణ, సమగ్ర నీటి యాజమాన్య నిర్వహణపై సోమవారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక సీఎస్ సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు. శ్రీశైలం నుంచి కృష్ణా జలాలు హంద్రీ-నీవా కాలువల గుండా 738 కిమీ ప్రయాణించి కుప్పం చేరాయని అధికారులు చెప్పినప్పుడు.. సంకల్పంతో పనిచేశామని, ఫలితం సాధించామని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా జల వనరుల శాఖ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందించింది. 'రాష్ట్రంలోని రిజర్వాయర్లు 90 శాతానికి పైగా నిండాయి. కృష్ణా, గోదావరి, పెన్నా, వంశధార నదుల ద్వారా ఇప్పటికే 310 టీఎంసీల వినియోగం జరిగింది. హంద్రీ-నీవా ద్వారా సీమ ప్రాజెక్టులకు సమృద్ధిగా నీళ్లు చేరాయి' అని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 70 టీఎంసీలు, ప్రకాశం బ్యారేజీ నుంచి 52 టీఎంసీలు, వంశధార నుంచి 8 టీఎంసీలను కాలువల ద్వారా సాగుకు అందించామన్నారు. ఇదే సమయంలో 1,969 టీఎంసీల వరద సముద్రం పాలైందన్నారు.

## వినాయక మండపాలకు ఉచిత విద్యుత్




అమరావతి, ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25 (టుడే విదుర): వినాయక చవితి సందర్భంగా ఉత్సవ సమితులు, మండపాల నిర్వాహకులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తామని మంత్రి లోకేశ్ సోమవారం 'ఎక్స్'లో ప్రకటించారు. దసరా ఉత్సవాలకు కూడా ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో చర్చించాను. వారు అంగీకరించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయనుంది. దసరా పందిళ్లకూ ఉచిత విద్యుత్ ఇస్తాం' అని పేర్కొన్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా 15 వేలకు పైగా వినాయక ఉత్సవ మండపాలకు ఉచిత కరెంట్ అందిస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒంగోలులో విలేకరులకు చెప్పారు. వినాయక చవితి, దసరా ఉత్సవాలకు ఉచిత విద్యుత్ కోసం రూ.25 కోట్లు కేటాయించామని తెలిపారు. కాగా, వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పేర్కొన్నారు.

## 19 నుంచి అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్: నరెడ్కో

విజయవాడ, ఆగస్టు 25(టుడే విదుర): రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నాలా చట్టం రద్దు, లే అవుట్ డెవలప్‌మెంట్, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ నిబంధనల్లో సడలింపు వంటి ప్రభుత్వ సానుకూల నిర్ణయాలతో పరిశ్రమలకు మేలు జరిగిందని నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) సెంట్రల్‌జోన్ అధ్యక్షుడు సందీప్ మండవ పేర్కొన్నారు. సోమవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబరు 19 నుంచి 21 వరకు నరెడ్కో సెంట్రల్ జోన్ 11వ అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్‌ను విజయవాడలోని ఏ-కన్వెన్షన్‌లో నిర్వహించనున్నామన్నారు. ఎస్ఎల్‌వీ డెవలపర్స్ చైర్మన్ పెనుమత్స శ్రీనివాసరాజు నరెడ్కో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్ పరుచూరి, సెంట్రల్‌జోన్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ హరి ప్రసాద్ పాల్గొన్నారు.

## చట్టసభల్లో అర్థవంతమైన చర్చలకు తగ్గిన ప్రాధాన్యం



న్యూఢిల్లీ,ఆగస్టు 25(టుడే విదుర): చట్టసభల్లో ప్రస్తుతం అర్థవంతమైన చర్చలకు తక్కువ ప్రాధాన్యం దక్కుతోందని ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. అరవడం, నినాదాలివ్వడం ఎక్కువ లాభదాయకమని సభ్యులు భావిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర శాసనసభ మొదటి స్పీకర్‌గా విఠల్‌భాయ్ పటేల్ ఎన్నికై వందేళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్రప్రభుత్వం శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆది, సోమవారాల్లో ఢిల్లీ అసెంబ్లీలో అఖిల భారత స్పీకర్ల సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో సోమవారం అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ సభలో సభ్యులు ఎక్కువ రోజులు కూర్చోవాలని, నేర్చుకోవాలని సూచించారు. ఇతరులు చెప్పేవి ఓపిగ్గా వినడం అలవాటు చేసుకొని, సరైన ప్రశ్నలు అడగడం నేర్చుకోవాలన్నారు. కేవలం రాజ్యాంగ ముసాయిదాను చర్చించడానికే రాజ్యాంగ సభ మూడేళ్ల లోపు వ్యవధిలో 106 రోజులు సమావేశమైందని తెలిపారు. రాజ్యాంగ ముసాయిదా అనే ఒకే ఒక్క అంశాన్ని చర్చించడానికి ఏడాదికి సగటున 50 రోజులు సమావేశమైందన్నారు. నేడు చర్చించడానికి వేలాది అంశాలున్నప్పటికీ కొన్ని రాష్ట్రాల శాసనసభలు సగటున ఏడాదికి 20 రోజుల కన్నా తక్కువ సమయం మాత్రమే సమావేశమవుతున్నాయని, ఇది ఆరోగ్యకరమైన ధోరణి కాదని తెలిపారు. ఏడాదిలో కనీసం 60 రోజులైనా శాసనసభను సమావేశపరిచేలా స్పీకర్లు రాష్ట్రప్రభుత్వాలను ఒప్పించే ప్రయత్నం చేయాలని సూచించారు.

## సందడిగా స్మార్ట్ కార్డుల పంపిణీ

అమరావతి, పెనమలూరు, ఆగస్టు 25(టుడే విదుర): రాష్ట్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల తొలివిడత పంపిణీ ప్రక్రియ సోమవారం 9 జిల్లాల్లో ప్రారంభమైంది. క్యూఆర్ కోడ్‌తో ఏటీఎం కార్డు సైజులో రూపొందించిన ఈ కార్డులను రాష్ట్రంలో ఉన్న దాదాపు 1.45 కోట్ల రేషన్ లబ్ధిదారులకు సెప్టెంబరు 15లోపు 4 విడతలుగా పంపిణీ చేస్తారు. తొలివిడత స్మార్ట్ కార్డుల పంపిణీని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం ఉదయం విజయవాడ తూర్పు నియోజకవర్గంలో, మధ్యాహ్నం కృష్ణా జిల్లా పెనమలూరులో ప్రారంభించారు. విజయనగరం, ఎన్టీఆర్, తిరుపతి, విశాఖపట్నం, నెల్లూరు, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లోని నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు ఈ కార్డుల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. ఈ నెల 29 వరకు సివిల్ సప్లయిస్ అధికారులు, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 53 లక్షల స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఈ నెల 30 నుంచి రెండో విడత చిత్తూరు, కాకినాడ, గుంటూరు, ఏలూరు జిల్లాల్లో, మూడో విడత సెప్టెంబరు 6 నుంచి అనంతపురం, అల్లూరి, పార్వతీపురం మన్యం, కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లో స్మార్ట్ కార్డుల పంపిణీ చేపడతారు. చివరి విడత పంపిణీ సెప్టెంబరు 7నుంచి 15 వరకు జరుగుతుంది.

# సంపాదకీయం

## ఓయూ పునర్వైభవం కోసం కలిసి నడుద్దాం..

దేశంలో తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాలు మొదలు ఎన్నో విశ్వవిద్యాలయాలు సమాజాభివృద్ధిలో కీలక భూమిక పోషించాయి. 108 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయ ఔన్నత్యం గురించి ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు. ఆయా రంగాల్లో అత్యంత క్రియాశీలక మేధావులను, నాయకత్వాన్ని అందించి ప్రపంచ చరిత్రలోనే ఉస్మానియా విశ్వవిద్యాలయం తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత ఎన్నో విశ్వవిద్యాలయాలు ఏర్పాటయ్యాయి. ఫలితంగా సామాన్యులు సైతం విద్య, పరిశోధనల్లో భాగస్వాములయ్యే అవకాశాలు దక్కాయి. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ, ఐటీ విప్లవంతో కూడిన ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను కాపాడుకునే బాధ్యత మనందరిది. తెలుగు రాష్ట్రాల్లో అత్యంత పేరు ప్రఖ్యాతి కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం... ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు నాయకత్వం వహించాల్సి ఉంటుంది. విశ్వవిద్యాలయం నాయకత్వం వహించటమంటే.... ఈ నేల, ఈ గాలి, ఈ జ్ఞాన నిధికి వారసులైన ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావటం. ఓయూ నుంచే ఎదిగిన ఓ ప్రపంచస్థాయి తత్వవేత్త పద ప్రయోగం చేసినట్లు... ఓయూ క్యాచ్‌మెంట్ ఏరియా పరిధిలోకి వచ్చే, అంటే ఓయూతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిపైనా ప్రభుత్వ రంగ విద్యను కాపాడుకునే బాధ్యత ఉంది. పేదలు, దిగువ మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చే చురుకైన, మేధోసంపత్తి కలిగిన విద్యార్థులకు ఆదెరువుగా ఉన్న ఉస్మానియా లాంటి విశ్వవిద్యాలయాల పురోగతి అనివార్యం. ఆధునిక ప్రపంచ గమనంలో ఏర్పాటైన ప్రైవేటు విశ్వవిద్యాలయాల పోటీని ఎదుర్కొని నిలవాలంటే.... సమకాలీన స్థితిగతులకు అనుగుణంగా ఆలోచన, కార్యాచరణ మనదగ్గరుండాలి. ప్రభుత్వాలు సహా భాగస్వాములందరినీ కలుపుకుని ప్రైవేటుకు దీటుగా మన విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేసుకోవాలి. ప్రపంచీకరణ తర్వాత ప్రభుత్వరంగ విద్యకు అనేక పరిమితులు ఏర్పడ్డాయి. మారుమూల పల్లెల్లోనూ ప్రైవేటు విద్య అందుబాటులోకి వచ్చింది. ఉన్నత విద్య పేదలకు అందకుండా పోయే ప్రమాదం సమీప భవిష్యత్తులోనే ఉంది. ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులోనూ ప్రభుత్వ విద్య అందుబాటులో ఉండాలంటే.... ప్రస్తుత ఆధునిక సమాజంలో ప్రభుత్వరంగ విశ్వవిద్యాలయాలను కాపాడుకునేందుకు ఓ వ్యూహం, ఎత్తుగడ అవసరం. %విశ్వవిద్యాలయాలు మేధో చర్చకు నిలయాలుగా ఉండటం చరిత్ర నేర్పిన పాఠం. యూజీసీ నిబంధనావళి ప్రకారం విశ్వవిద్యాలయాల పరిశోధనల ఫలితాల ద్వారా ప్రభుత్వ పథకాలను రూపొందించుకోవాలని ఎన్నోసార్లు ఉద్ఘాటించారు. కనుక మన చర్చలన్నీ నిర్మాణాత్మకంగానే ఉండాలి. కానీ, కొన్ని సందర్భాలలో కొందరు వ్యక్తులు, కొన్ని సంస్థలు ముందూ వెనకా ఆలోచించకుండా.... ఆవేశకావేశాలకు లోనుకావటం ద్వారా ప్రస్తుత పరిస్థితుల్లో విశ్వవిద్యాలయాల దిశను మార్చలేము. ఈ సందర్భంలో తన సాహిత్యానికి నాలుగుసార్లు పులిట్జర్ బహుమతి పొందిన అమెరికన్ రచయిత రాబర్ట్ ఫ్రాస్ట్ చెప్పిన... "విద్య అంటే మీ కోపాన్ని లేదా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవటం కాదు, ఏదైనా వినయంతో వినగల సామర్థ్యాన్ని కలిగి ఉండటం" అనే మాటలు గుర్తొస్తున్నాయి. రాజకీయ కారణాలు, వ్యక్తిగత అవసరాలతో చేసే నినాదాల పట్ల విద్యార్థులు, పరిశోధకులు అప్రమత్తంగా ఉండాలి. వాస్తవిక విషయాలను అర్థం చేసుకుని మసలుకోవాల్సిన అవసరాన్ని గుర్తెరగాలి. గుడ్డిగా ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకత్వాన్ని అడ్డుకోవడం, వ్యతిరేకంగా నినదించటం వల్ల జరిగే నష్టాన్ని అర్థం చేసుకోవాలి. ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకించడమంటే ప్రభుత్వ యంత్రాంగాన్ని బహిష్కరించటం కాదు. తద్వారా జరగాల్సిన మేలు కన్నా కీడే ఎక్కువ. అయితే.. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపేందుకు వేరే పద్ధతులున్నాయి. రాజకీయంగా ఏవైనా భిన్నాభిప్రాయాలుంటే అందుకు వేరే వేదికలను వినియోగించుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర విద్యావ్యవస్థకు దిక్సూచిగా, పెద్దన్నగా ఉన్న ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిస్థితి గురించి మనం ప్రత్యేకంగా చర్చించుకోవాలి. ప్రతి సందర్భంలోనూ 'రాజకీయ నాయకత్వాన్ని అడ్డుకుంటాం, బహిష్కరిస్తాం' లాంటి నినాదాలు గత పదేళ్లలో ఎక్కువగా విన్నాం. ఇలాంటి వ్యాఖ్యలు ఉస్మానియా విశ్వవిద్యాలయం పట్ల సమాజంలో తప్పుడు అభిప్రాయాన్ని కల్గించే అవకాశం ఉంది. ఇది జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్‌లు, న్యాక్ గుర్తింపుపై ప్రభావం చూపుతుంది. విదేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో సీటు పొందాలంటే ఇప్పుడున్న ప్రమాణాల ప్రకారం మన దేశంలోని విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌లను, న్యాక్ గుర్తింపులను ప్రమాణంగా తీసుకుంటారు. ఫలితంగా ఇక్కడ చదువుకునే తెలంగాణ భూమి పుత్రుల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునే ప్రమాదం ఉంది. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తిరిగి పునర్వైభవం తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ పౌర సమాజంపై ఉంది. వర్సిటీ పరిధిలో ఉన్న 730కి పైగా కళాశాలల్లో మూడున్నర లక్షల మంది విద్యార్థులు దాదాపు 175 విభిన్న కోర్సుల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. వారి బంగారు భవిష్యత్తుకోసం అవసరమైన నైపుణ్యాలను పెంపొందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. ఇందుకోసం విద్యార్థులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు ఓ కార్యాచరణతో ముందుకు వెళ్లాలి. ప్రభుత్వాలను భాగస్వామ్యం చేస్తూ ఓయూను అభివృద్ధి పథంలో నడిపించే పంథాను అనుసరించాలి. ఇప్పటికే పదమూడేళ్లుగా బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు లేక రాష్ట్ర విశ్వవిద్యాలయాలు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రభుత్వ సహకారంతో అధిగమించాలి.

# ఏపీలో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు




అమరావతి, ఆగస్టు 25(టుడే విదుర): బంగాళాఖాతం లో అల్పపీడనం కారణంగా వచ్చే మూడు రోజులు ఏపీలో భారీ వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.ఐఎండి సూచనల ప్రకారం రేపు వాయువ్య బంగాళాఖాతంలో ఒడిశా పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకుని అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు ఉత్తరాంధ్రలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉత్తరాంధ్ర తీరం వెంబడి ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని సూచించారు. భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు చెట్ల క్రింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు, హోర్డింగ్స్ వద్ద ఉండరాదని హెచ్చరించారు. అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోను పొంగిపొర్లే వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదన్నారు.

# వచ్చేశాయ్ ఎగ్ కార్ట్‌లు!



**అమలాపురం మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద**
**డ్వాక్రా మహిళల పంపిణీకి సిద్ధంగా ఉన్న ఎగ్ కార్ట్‌లు**
**గుడ్లతో విభిన్న రుచులతో వంటకాలు**
**డ్వాక్రా మహిళలకు ఉచితంగా ఎగ్‌కార్టులు**
**జిల్లావ్యాప్తంగా 40 ఎగ్‌కార్టులు మంజూరు**
**గ్రామీణ మహిళలకు ఉపాధే లక్ష్యం**

అమలాపురం రూరల్/మండపేట,ఆగస్టు 25(టుడే విదుర): గుడ్డు.. వెరీ గుడ్డు. నూరుశాతం కల్తీలేని అధిక పోషకాలు కలిగిన కోడిగుడ్లు తినడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చునంటూ నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (నెక్) విస్తృత ప్రచారం చేపట్టింది. కోడిగుడ్ల వినియోగాన్ని పెంచడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడంతోపాటు డ్వాక్రా మహిళలకు ఆర్థిక చేయూతను అందించేందుకు సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) ఒప్పందం కుదుర్చుకుంది. దీనిలో భాగంగా రూ.50 వేలు విలువైన ఎగ్‌కార్ట్‌లను డ్వాక్రా మహిళలకు ఉచితంగా అందించేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. కోనసీమ జిల్లాకు 40 ఎగ్‌కార్ట్‌లను అందించేందుకు నిర్ణయించారు. దీనిలో భాగం గా జిల్లాకు తొలివిడతలో ఎనిమిది ఎగ్ కార్ట్‌లు చేరుకున్నాయి. ఒక్కో యూనిట్ విలువ ఉండ గా, దీనిలో రూ.35 వేలు యూనిట్‌కాగా, మరో రూ.15 వేల విలువైన వంట సామగ్రి అందించనున్నారు. ఈ యూనిట్ ద్వారా వ్యాపారం చేసే మహిళలు నెలకు రూ.20 వేల వరకు ఆదాయం పొందేలా ప్రభుత్వం రూపకల్పన చేసింది.డ్వాక్రా మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ఎగ్ కార్ట్‌ల వినూత్న పథకానికి శ్రీకారం చుట్టింది. కోడిగుడ్డు కేవలం ఆరోగ్యానికి మాత్రమే కాదు. డ్వాక్రా మహిళలకు ఆదాయాన్ని తెచ్చిపెట్టగలవని చెబుతున్నారు. నిత్యం గుడ్ల వంటకాలతో పోషకాహారాన్ని అందిస్తూ మహిళలు రోజువారీ ఆదాయం పొందేందుకు ఎగ్‌కార్ట్‌లు దోహదపడతాయి. ఇటీవలకాలంలో పల్లె, పట్టణం అన్న బే ధం లేకుండా ఎక్కడ చూసినా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లే. ఆయా సెంటర్లలో ఎగ్ ఫ్రైడ్‌రైస్, ఎగ్ నూడుల్స్, ఎగ్ బజ్జీ, ఆమ్లెట్లు వంటివి సర్వ సాధారణమైపోయాయి. దోసెలపై కోడిగుడ్లను ఆమ్లెట్‌గా వేయడం, పరోటా విత్ ఎగ్, ఎగ్65, గోం గూర విత్ ఎగ్ దోశ, ఎగ్ ఫ్రీరోస్ట్ వంటి అనేక రకాల వంటకాలు మార్కెట్‌లో జోరుగా అందుబాటులో ఉన్నాయి. ప్రతీరోజు విభిన్న రుచులతో గుడ్లు తినే అలవాటును ప్రోత్సహించడంతోపాటు అన్ని రకాల గుడ్డు వంటకాలను ఒకేచోట అందించడం ఎగ్‌కార్ట్‌ల లక్ష్యం.



# ఏమైందో ఏమో?

**అనుమానాస్పదస్థితిలో భార్యాభర్తల మృతి**
**ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చునని పోలీసుల అనుమానం**
**పెళ్లయిన 8 నెలలకే ఘటన**


కొత్తవలస, ఆగస్టు 25(టుడే విదుర): మండలంలోని అప్పన్నదొరపాలెం పంచాయతీ తమ్మన్నమెరక గ్రామంలో భార్యాభర్తలు అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన ఘటన ఉదయం వెలుగు చూసింది. ఇందుకు సంబంధించి సీఐ షణ్ముఖరావు, స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అప్పన్నదొరపాలెం పంచాయతీ జోడుమెరక గ్రామానికి చెందిన గీతల వెంకట లక్ష్మి (28), వేపాడ మండలం చినదుంగాడ (కొప్పలవానిపాలెం) గ్రామానికి కొప్పల చిరంజీవి(30) ఒకరినొకరు ప్రేమించుకున్నారు. ఒకే గిరిజన సామాజిక వర్గానికి చెందిన వీరు ఎనిమిది నెలల కిందట తమ పెద్దలను ఒప్పించి కొప్పలవానిపాలెంలో వివాహం చేసుకున్నారు. తరువాత కొద్ది రోజులకు తమ్మన్నమెరక గ్రామానికి వచ్చి అక్కడే జగనన్న కాలనీలో ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. చిరంజీవి విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం రామవరంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా, వెంకటలక్ష్మి కొత్తవలసలోని ఓ ప్రైవేట్ స్టోర్‌లో పని చేస్తోంది. ఈ నేపథ్యంలో ల ఉదయం వారి బంధువులు తమ్మన్నమెరకలోని చిరంజీవి ఇంటికి వచ్చారు. అక్కడ చిరంజీవి ఉరేసుకుని విగతజీవిగా కనిపించగా, వెంకటలక్ష్మి కిందపడి మృతిచెంది ఉండడంతో గ్రామపెద్దలకు సమాచారం ఇచ్చారు. దీనిపై గ్రామ సర్పంచ్ జోడు రాములమ్మ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కొత్తవలస సీఐ షణ్ముఖరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విజయనగరం నుంచి క్లూస్‌టీం సిబ్బంది వచ్చి ఇంట్లో వేలి ముద్రలను సేకరించారు.

# పింఛన్లపై పీక్స్‌కు ఫేక్




గార రూరల్, శ్రీకాకుళం, కోడూరు,ఆగస్టు 25(టుడే విదుర): అర్హులైనవారిలో ఏఒక్కరి పింఛను కూడా తొలగించరాదనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. పింఛన్లకు అర్హత విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని అధికారులను పదేపదే ఆదేశిస్తోంది. అయినా, అధికారుల నిర్లక్ష్యంతో అక్కడక్కడ పొరపాట్లు జరుగుతున్నాయి. మరోవైపు, ఫించన్లపై ఫేక్ ప్రచారాలు జోరందుకున్నాయి. వడపోతలో దివ్యాంగులు కాదని తేలినవారి పింఛన్లను ప్రభుత్వం తొలగిస్తే.. అదేదో నేరం, ఘోరం అయినట్టు వైసీపీ సోషల్ మీడియా గగ్గోలు పెడుతోంది. అర్హులు కానివారిని అర్హులుగా చిత్రీకరిస్తూ.. ఫేక్ ఫొటోలు, మార్ఫింగ్ చిత్రాలతో విషం కక్కుతోంది. శ్రీకాకుళం జిల్లా గార మండలం అంపోలులో ఆర్థిక ఇబ్బందులతో దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. అయితే, దివ్యాంగ పింఛన్ తీసివేయడం వల్ల మనస్తాపం చెంది బలవన్మరణం చెందారని ఫేక్ సైకోలు తప్పుడు కథనాలు అల్లారు. అంపోలుకు చెందిన కొల్లి అప్పారావు(45), కొల్లి లలిత(42) దంపతులు. వీరికి ఇంటర్ చదువుతున్న కుమార్తె దేవి ఉంది. అప్పారావు ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడు. ఆయనకు కళ్లు సరిగ్గా కనబడవు. అంధత్వ సమస్య పెరగడంతో ఉద్యోగం మానేశారు. దీంతో లలిత కూలి పనికి వెళ్లి కుటుంబాన్ని పోషించుకునేది. కుటుంబ అవసరాల కోసం దొరికినకాడకు అప్పులు చేశారు. వృద్ధురాలైన అప్పారావు తల్లి ఇటీవల మృతి చెందింది. దీంతో ఉమ్మడి ఆస్తిగా ఉన్న ఇంటిని ఖాళీ చేయాలని అన్నదమ్ముల నుంచి అప్పారావుపై ఒత్తిడి వచ్చింది.దీంతో ఆత్మహత్య చేసుకోవాలని అప్పారావు, లలిత, దేవి నిర్ణయించుకున్నారు. రాత్రి వారు ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తెల్లవారుజామున వారి ఇంట్లోకి స్థానికులు వెళ్లిచూడగా అప్పారావు, లలిత విగతజీవులుగా పడిఉన్నారు.

# 7న దుర్గ గుడి మూసివేత



విజయవాడ(ఇంద్రకీలాద్రి),:ఆగస్టు 25(టుడే విదుర): చంద్ర గ్రహణం కారణంగా సెప్టెంబరు 7వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటల నుంచి విజయవాడలోని ఇంద్రకీలాద్రిపైనున్న దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోని ప్రధాన ఆలయం, ఉపాలయాలన్నింటినీ మూసివేస్తున్నట్టు దేవస్థానం ఈవో వి.కె.శీనానాయక్ తెలిపారు. ఆ రోజు 3.30 గంటలకు కవాట బంధనం చేయనున్నట్టు వైదిక కమిటీ తెలిపిందని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. 8వ తేదీ ఉదయం 8.30 గంటల నుంచి తిరిగి భక్తులకు దర్శనం ఉంటుందని తెలిపారు.

# కళ్లెదుటే నదిలో దూకిన తల్లి



తాడేపల్లిఆగస్టు 25(టుడే విదుర): పేగు బంధం పక్కనే ఉన్నా సుడులు తిరుగుతున్న నీళ్లలో తల్లి దూకగా.. కళ్లలో నీళ్లు సుడులు తిరిగేలా ఏడ్వడం మినహా ఏమీ చేయలేని దీన స్థితిలో బాలిక మిగిలింది. కన్న బిడ్డ ఎదుటే మహిళ నదిలో దూకిన ఘటన సీతానగరం పుష్కర ఘాట్ వద్ద శనివారం జరిగింది. ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణా నదికి బిడ్డతో కలిసి సాయంత్రం వచ్చిందో తల్లి. సీతాపురం పుష్కర్ ఘాట్ వద్ద ఇద్దరూ నిల్చుని ఉన్నారు. చిన్నారి బిడ్డ నీటి ప్రవాహాన్ని చూస్తుండగా ఆ పిల్ల ఎదుటే తల్లి నీళ్లలో దూకింది. ఏ జరుగుతుందో ఊహించనైనా లేని ఆ చిన్నారి బిగ్గరగా ఏడవడంతో చూట్టుపక్కల వారు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు చిన్నారిని దగ్గరకు తీసుకున్నారు. నీటి ప్రవాహ ఉధృతి అధికంగా ఉండడంతో తల్లి ఆచూకీ అయినా కనిపించలేదు. తన పేరు అనేక్య అని, నదిలో దూకిన మహిళ తన తల్లి విజయ భార్గవి అని మాత్రమే బాలిక చెప్పగలుగుతోంది. మిగతా వివరాలేమీ చెప్పలేకపోతోంది. వివరాలు తెలిసిన వారుంటే సిఐ : 868883136, ఎస్ఐ : 8143873409, కానిస్టేబుల్ 9704352206 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని పోలీసులు కోరారు

# ఎరువులు కోసం పడిగాపులు

**మార్కెట్ యార్డులో ఎరువుల కోసం ఎదురుచూస్తున్న రైతులు**



మంగళగిరి ఆగస్టు 25(టుడే విదుర): ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు పూర్తవుతుంది. ఇటీవల వర్షాల నేపథ్యంలో వివిధ పంటలు సాగు చేసిన రైతులు వాటికి ఎరువులు వేయడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. కాంప్లెక్స్ ఎరువుల కోసం రెండు మూడు రోజులు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. యూరియా అందుబాటులో లేదంటు న్నారు. ఎరువులు కావాలంటే రెండు మూడ్రోజులు తిరగాల్సి వస్తోందని, ఒకరోజు వచ్చి పేరు నవోదు చేయించుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. మంగళగిరి పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో గల ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రం వద్ద ఎరువుల కోసం రైతులు పడిగాపులు పడ్డారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతులు తమ ఆధార్ కార్డులు చేతుల్లో పట్టుకుని పేర్లు నమోదు చేయించుకోవడానికి నానా అగచాట్లు పడ్డారు. కాంప్లెక్స్ ఎరువు ఏది వాడినా యూరియా కలపాల్చి వస్తుందని, యూరియా దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఎరువుల కొరతేమీ లేదని మండల వ్యవసాయాధికారి శైలజారాణి చెబుతున్నారు. అన్ని పిఎస్‌సిఎస్ ద్వారా రైతులకు అందుబాటులో ఉంచామని, ఇప్పటివరకు 1,28,200 బస్తాలు పంపిణీ చేశామని చెబుతున్నారు.

# వ్యసనాలకు బానిసై దొంగలుగా మారి..



**ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరి అరెస్టు**
**రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు**
**వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకట అప్పారావు**

పలాస, ఆగస్టు 25(టుడే విదుర): ఉన్నత చదువులు చదువుకోవాల్సిన ఓ ఇద్దరు యువకులు వ్యసనాలకు బానిసై దొంగలుగా మారారు. పదో తరగతి వరకూ చదువుకున్న వీరిద్దరూ ఉన్నత చదువుల చదవకుండా గంజాయి, మత్తు పదార్థాల బారినపడి దొంగతనాలకు పాల్పడి కాశీబుగ్గ పోలీసులకు పట్టుబడ్డారు. పలాస మండలం గరుడఖండి గ్రామానికి చెందిన కవిటి నిఖిలేష్(22), ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా కాశీనగర్‌కు చెందిన తూముల కార్తికేయ(22) కొన్నేళ్ల కిందట టెన్త్ తర్వాత చదువు మానేసి జల్సాలకు అలవాటుపడ్డారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనాల దొంగలుగా మారారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ వి.వెంకటఅప్పారావు వెల్లడించారు. పలాస మండలం టెక్కలి పట్నం గ్రామానికి చెందిన డోర సురేష్ తన ద్విచక్రవాహనాన్ని ఇంటివద్ద ఈనెల 14న పార్కింగ్ చేశాడు. మరుచటి రోజు ఉదయం చూసేసరికి కనిపించలేదు. దీంతో ఆయన కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గార మండలం మెండ పేట గ్రామానికి చెందిన మెండ ఢిల్లేశ్వరరావు కాశీబుగ్గలో పనుల మీద వచ్చి ఓ ప్రైవేట్ ఆసుపత్రి వద్ద ఈ నెల 18న తన బైక్‌ను పార్కింగ్ చేశాడు. తిరిగి వచ్చిచూసే సరికి తన వాహనం కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు కేసులను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో నిఖిలేష్, తూముల కార్తికేయ విశాఖ నుంచి వస్తుండగా పోలీసులకు తారాసపడ్డారు. వారి ని విచారించగా ద్విచక్ర వాహనాలు తామే దొంగతనం చేసినట్టు అంగీకరించారు. వీరిద్దరూ శ్రీకాకుళం పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి వరకూ కలసి చదువుకున్నారు. మద్యం, గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటుపడి చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. వీరి తల్లిదండ్రులు ఇచ్చే డబ్బులు సరిపడక పోవడంతో ద్విచక్ర వాహనాలు దొంగతనం చేస్తూ జల్సాలకు అలవాటు పడ్డారు. విశాఖలో కూడా వీరిపై ద్విచక్ర వాహనాల దొంగతనాలపై కేసులు నమోదయ్యా యి. చోరీ చేసిన వాహనాలను విశాఖలో అమ్మేసి వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తుంటారు. వీరిద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. సీఐ పి.సూర్యనారాయణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# అంతా క్యాషే.. నో ఫోన్‌పే



పెద్దదోర్నాల ఆగస్టు 25(టుడే విదుర): పెద్దదోర్నాల పట్టణంలో ఇటీవల వెలుగులోకి వచ్చిన హగ్ యాప్ కుంభకోణంతో వందలాది మంది బాధితులు తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆన్‌లైన్ చెల్లింపులపై స్థానిక ప్రజల్లో తీవ్ర అనుమానాలు నెలకొనడంతో పట్టణంలో మొత్తం వ్యాపార వాతావరణం క్యాష్ ఓన్లీగా మారింది. ఈ సందర్భంగా పెద్దదోర్నాల ఎస్ఐ పి మహేష్ స్థానిక ప్రజలు, వ్యాపారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆన్‌లైన్ ద్వారా డబ్బులు చెల్లించవద్దని, తప్పనిసరిగా నగదుతోనే కొనుగోళ్లు జరపాలని ఆయన సూచించారు. ఈ హెచ్చరికలతో వ్యాపారులు కూడా తమదైన రీతిలో కఠిన నిర్ణయం తీసుకున్నారు. దుకాణదారులు ఏ వస్తువైనా కొనాలంటే నగదు ఇచ్చినప్పుడే ఇస్తామని కస్టమర్లకు స్పష్టంగా తెలియజేశారు.ప్రజలు క్యాష్‌తోనే కొనుగోళ్లు.. ఫోన్ పేలు, గూగుల్ పేలు, ఇతర ఆన్‌లైన్ పేమెంట్లకు వ్యాపారులు నో చెప్పడంతో, శనివారం పట్టణమంతా క్యాష్ లావాదేవీలతోనే నడిచింది. ఏ దుకాణంలోనైనా వస్తువు కొనాలంటే నగదు చెల్లించక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీంతో కస్టమర్లు కూడా చేతిలో డబ్బు పెట్టుకుని షాపింగ్‌కు వెళ్లారు. హగ్ యాప్ ద్వారా పెట్టుబడులు పెట్టి మోస పోయిన వందలాది మంది యువకులు, స్థానికుల అనుభవం ప్రజల్లో ఆర్థిక భయాందోళన కలిగించింది. ఆన్‌లైన్ చెల్లింపులు సురక్షితం కాదనే భావన భావన బలపడింది.ప్రత్యేక పరిస్థితుల్లో పెద్దదోర్నాల.. పెద్దదోర్నాల పట్టణం ప్రస్తుతం పూర్తిగా క్యాష్ ఆధారితంగా మారడం విశేషం. ఒక్కరోజులోనే డిజిటల్ ఇండియా నుంచి క్యాష్ ఓన్లీ ఇండియాకి వెనక్కి వెళ్లినట్టయింది. ఆర్థిక లావాదేవీలలో భద్రతే ముఖ్యమని ప్రజలందరూ గుర్తించారని స్థానికులు చెబుతున్నారు. మొత్తం మీద హగ్ యాప్ మోసం ప్రభావంతో పెద్దదోర్నాల పట్టణం క్యాష్ లావాదేవీలకే పరిమితమై, ఆన్‌లైన్ పేమెంట్లకు తాళం వేసినట్లయింది.




# బార్.. బేర్

**లైసెన్స్ దరఖాస్తులకు స్పందన కరువు**
**840 బార్లకు వచ్చింది 30 మాత్రమే**
**ఔత్సాహికుల కోసం 'ఎక్సైజ్' ఎదురుచూపులు**
**రేపటితో ముగుస్తున్న గడువు**

అమరావతి, ఆగస్టు 25(టుడే విదుర):దరఖాస్తుల సమర్పణకు గడువు సమీపిస్తున్నా రాష్ట్ర నూతన బార్ విధానానికి స్పందన కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 840 బార్లకు లైసెన్స్‌లు ఇవ్వడానికి నోటిఫికేషన్ జారీచేస్తే.. ఈ వారం రోజుల్లో కేవలం 30 దరఖాస్తులే వచ్చాయి. దరఖాస్తులు సమర్పించేందుకు మంగళవారం చివరి రోజు. మరో రెండ్రోజులే గడువున్నా వ్యాపారుల్లో పెద్దగా స్పందన కనిపించకపోవడంతో ఎక్సైజ్ అధికారులు ఆందోళన చెందుతున్నారు. కొత్త పాలసీ విఫలమవుతుందన్న ప్రచారం ఉధృతమైంది. రాత్రి వరకు కృష్ణా జిల్లాలో 13, కర్నూలు-1, నంద్యాల-1, ఎన్టీఆర్-7, పల్నాడు-1, ప్రకాశం-3, తిరుపతి-1, విజయనగరం-1, కడప జిల్లాలో రెండు వచ్చాయి. వీటిలోనూ నాలుగు దరఖాస్తులు వచ్చిన బార్లు రెండే ఉన్నాయి. నాలుగు కంటే తక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ తీయరు. అంటే లాటరీ తీయదగిన స్థాయిలో దరఖాస్తులు అందింది కేవలం రెండు బార్లకు మాత్రమే. కాగా సుమారు వెయ్యి మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారు రూ.5 లక్షలు చెల్లించి తుది దరఖాస్తులు సమర్పిస్తారా అనేది అనుమానంగా మారింది. ఒకవేళ వారంతా దరఖాస్తులు సమర్పించినా 30 శాతం బార్లే లాటరీలోకి వస్తాయి. 840 బార్లకు లాటరీ తీయాలంటే మొత్తం 3,360 దరఖాస్తులు రావాలి. అది కూడా ప్రతి బార్‌కు నాలుగు చొప్పున దరఖాస్తులు అందాలి. ఒకవేళ ఏదైనా బార్‌కు నాలుగు కంటే ఎక్కువ దరఖాస్తులు వేస్తే మొత్తం దరఖాస్తుల సంఖ్య ఇంకా పెరగాలి. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే చివరికి సగం బార్లకైనా వస్తాయా అనే అనుమానం కలుగుతోంది.

# ఘాట్ రోడ్డుపై పశువుల సంచారం



అనంతగిరి: ఆగస్టు 25(టుడే విదుర): ప్రముఖ పర్యాటక కేంద్రమైన అనంతగిరి ఘాట్ రోడ్డు శివలింగపురం ప్రధాన రహదారి వద్ద నిత్యం పశువుల బెడద అధికైంది. దీంతో అనంతగిరి, అరకు, దుంబ్రిగుడ. వంటి ప్రముఖ పర్యాటక కేంద్రాలను తిలకించేందుకు వస్తున్న పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు పొడవునా పశువులు గుంపు గుంపులుగా చేరి ఉంటాయి. దీంతో వాహన చోధకులు పశువుల గుంపులను తప్పించుకొని ముందుకు వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. తప్పించుకున్న క్రమంలో పశువులను వాహనాలు చిన్న పాటి ఢకొరెటే అందుకు పరిహారం చెల్లించాలని స్థానికులు వారిపై ఘర్షణలు పడుతున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా స్థానిక పంచాయతీ, సచివాలయం సిబ్బంది సమస్యను పరిష్కరించాలని కోరారు.

# ఐడియా అదిరిందిగా..



ఇంటర్నెట్ డెస్క్: ఆగస్టు 25(టుడే విదుర):పొలానికి కూలీలను తీసుకెళ్లడానికి, పంట ఉత్పత్తులను ఇంటికి తీసుకుని రావడానికి ఓ రైతు కొత్తగా ఆలోచించాడు. విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం గౌరిపురానికి చెందిన రైతు ఆదారి మోహన్‌కు ఐదెకరాల పొలం ఉంది. గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ పొలంలో పని చేయడానికి 10 మంది కూలీలు అవసరం. వీరిని పొలానికి తీసుకెళ్లిన ప్రతిసారీ రూ.200 ఖర్చవుతోంది. ఈ ఖర్చును తగ్గించుకోడానికి మోహన్ కొత్తగా ఆలోచించారు. తన ఆలోచనను వర్క్‌షాపు నిర్వాహకుడికి చెప్పి.. తన బైక్‌కు చిన్న ట్రాలీలాంటిది చేయించుకున్నారు. ఇప్పుడు పావు లీటరు పెట్రోలుతో.. ఆటో కోసం ఎదురుచూసే పని లేకుండా కూలీలను పొలానికి తీసుకెళ్తున్నానని రైతు చెప్పారు. పంట ఉత్పత్తులను ఇంటికి తెచ్చుకునేందుకూ ఈ ట్రాలీ ఉపయోగపడుతోందని, దీని తయారీకి రూ.15వేలు అయిందని తెలిపారు.

# ఫ్యాక్షన రాజకీయాలకు దూరంగా ఉండండి



ప్రొద్దుటూరు ,ఆగస్టు 25(టుడే విదుర): గ్రామాల అభివృద్ధితో పాటు యువత భవి ష్యత్తును తీర్చిదిద్దేలా వ్యవసాయంవైపు దృష్టి సారించాలే తప్ప ఫ్యాక్షన రాజకీయా లకు వెళ్లరాదని రూరల్ సీఐ బాలమద్దిలేటి పేర్కొన్నారు. మండల పరిధి లోని పెద్దశెట్టిపల్లె పంచాయతీ శంకరాపురం గ్రామంలో రూరల్ సీఐ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా రూరల్ సీఐ బాలమద్దిలేటి మాట్లాడుతూ అమాయక ప్రజలను సులభంగా మోసం చేసే సైబర్ నేరాలు పెరిగి పోయాయని వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజు తదితరులు పాల్గొ న్నారు.

# క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

క్రికెట్ బెట్టింగ్ ముఠా వివరాలు వెల్లడిస్తున్న నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్

## నలుగురి అరెస్ట్.. రూ.8.40 లక్షల నగదు, 8 సెల్‌ఫోన్లు, టీవీ స్వాధీనం



కోరుకొండ, ఆగస్టు 25(టుడే విదుర):తూర్పుగోదావరి జిల్లా నార్త్‌జోన్ పరిధిలో స్థానిక పోలీసులు క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. కోరుకొండ పోలీ స్‌స్టేషన్లో నిర్వహించిన విలేకర్ల సమా వేశంలో నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ వివరాలను వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేర కు కోరుకొండ మండలం కాపవరంలోని ఓ ఇంట్లో నిర్వహించిన దాడుల్లో బెట్టింగ్ ముఠాను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.8.40 లక్షల నగదు, 8 సెల్‌ఫోన్లు, టీవీ, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బెట్టింగ్‌కి పాల్పడుతు న్న ప్రధాన నిందితుడిగా గుర్తించిన విశాఖ పట్నానికి చెందిన రాకేష్ పరారీలో ఉన్నాడని.. బెట్టింగ్‌కు పాల్పడిన గోసంశెట్టి వీరప్రసాద్, జా జుల బాలచక్రం, నల్లల లక్ష్మీనరసయ్య, కొడతాల నానాజీని అరెస్ట్ చేశామన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన కోరుకొండ, సీతానగరం పోలీస్ సిబ్బందికి రివార్డు అంద జేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఆన్‌లైన్ బెట్టి ంగ్‌ల వల్ల కుటుంబాలు నాశనం అవుతున్నాయ ని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో సీఐ వై.సత్యకిషోర్, ఎస్ఐ కేవీ నాగార్జున, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తడిచెత్త.. పొడిచెత్త వేరు చేయలేరా?



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 25(టుడే విదుర): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు చెందిన సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మె ంట్ ప్లాంట్ పనితీరుపై కలెక్టర్, కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం పేపరుమిల్లు ఎదురుగా లూథర్‌గిరి వెనుక ప్రాంతం లో ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాంట్‌లో వ్యర్థాల సేకరణ, శు ద్ధి, రీసైక్లింగ్ , కంపోస్టింగ్ పనుల తీరు పరిశీలించారు. హెల్త్ అధికారుల నుంచి ప్రొసెస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నగరంలో రోజుకు 160 టన్నుల చెత్త ఉ త్పన్నం అవుతున్నా తడి చెత్త, పొడిచెత్త వేరు చేసే ప్రక్రియ సక్రమం గా జరగకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశా రు. సంబంధిత ఏఈ గైర్హాజరు కావడంపై తీవ్రంగా స్పందించి షోకాజ్ నోటీసులు ఇవ్వా లని ఆదేశించారు. విధి నిర్వహణలో అలస త్వం ప్రదర్శిస్తే ఏ స్థాయి అధికారి అయినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆమె వెంట అదనపు కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్,డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, ఎస్ఈ ఎంఓహెచ్ కోటేశ్వరరావు, ఈఈ రీటా, డీఈ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఉల్లి ధర తగ్గింది



## పెరిగిన కూరగాయల ధర
## నిలకడగా చికెన్

తాడేపల్లిగూడెం, ఆగస్టు 25(టుడే విదుర): మార్కెట్లో ఉల్లి ధర పడిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఉల్లి తడిసిపోవడంతో ధర పతనమైంది. క్వింటా ఉల్లి సైజును బట్టి రూ. 500 నుంచి 1000 ధరకు విక్రయించారు. కర్నూ లు నుంచి 10 లారీల ఉల్లి తాడేపల్లిగూడెం మా ర్కెట్‌కు వచ్చింది. నాణ్యత తోపించడంతో కొను గోలు చేయడానికి చిరు వ్యాపారులు ముందుకు రాలేదని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిపోవడంతో బస్తాల్లో డ్యామేజ్‌లు వచ్చాయి. బస్తాల్లో ఉండ గానే కొంత ఉ ల్లి కుళ్లిపోయింది. ఎన్నడూ లేనివి ధంగా కర్నూల్‌లో ఈ సీజన్‌లో ఉల్లిని సాగు చేశారు. పెద్ద సైజుల్లో ఉల్లి వచ్చిందని రైతులు ఆనందపడ్డారు. మంచి ధర వస్తుందని ఆశగా ఎదురు చూశారు. తీరా వర్షాల ప్రభావంతో ఉల్లి తడిసింది. అయినకాడికి అమ్ముకోవాల్సి వచ్చింది.మహారాష్ట్ర ఉల్లికి డిమాండ్ తగ్గలేదు. క్వింటా హోల్ సేల్ రూ.1500 నుంచి 2100 మ??ధ్య విక్ర యిస్తున్నారు. రిటెయిలర్స్ రూ.100కు నాలుగు కేజీలు, నాసిరకం కలిపి రూ.100కు 5 కిలోల వంతున అమ్ముతున్నారు. గత వారంతో పోలిస్తే మహారాష్ట్ర ఉల్లి ధరలో పెద్దగా వ్యత్యాసం లేదు.

# డొక్కా సీతమ్మ జీవిత చరిత్రపై...



పి.గన్నవరం,ఆగస్టు 25(టుడే విదుర): అపర అన్నపూర్ణగా ప్రసిద్ధి గాంచిన డొక్కా సీతమ్మ జీవి త చరిత్ర ను ఇప్పటికే వివిధ రూపాల్లో తెరకెక్కిం చారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు పలు తరగతుల పాఠ్య పుస్తకాల్లో ప్రచురిం చారు. తాజాగా గౌరి ప్రసాద్ మీడియా బ్లాక్అండ్‌వైట్ మూవీ మార్క్ సంస్థ అన్నపూర్ణ తల్లి బువ్వమ్మ పేరుతో డాక్యుమెంటరీని చిత్రీకరిస్తున్నారు. డైరెక్టర్ సురేష్ లంకలపల్లి నూతన నటీనటులతో పలు దృశ్యాలను డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలోని లంకలగన్న వరంలో గోదావరి తీర ప్రాంతంలో చిత్రీకరించారు. దర్శకుడు సురేష్ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ అడిగినవారికి లేదనకుండా అన్నం వండి వడ్డించేవారని.. ఆమె జీవిత విశేషాలు, అపురూప ఘట్టాలను తెరకెక్కిస్తున్నామన్నారు. 20రోజులు పాటు లంకలగన్న వరంలో డొక్కా సీతమ్మ నివా సం, గోదావరి నదిపరివాహక ప్రాంతాలతో పాటు పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండ లం ఆయో ధ్యలంకలో పలు సన్నివేశాలను చిత్రీకరిస్తామని చెప్పారు. ఈ డాక్యుమెంటరీకి నిర్మాతగా సిరాజ్, ఖాదర్ వ్యవ హరించగా సింహరాశి డైరెక్టర్ సముద్ర, షిలిక లేనోజా, ఆదిల్, రమేష్, కుసుమ తదితర నూత న నటులు నటిస్తున్నారని.. సంగీతం సాకేత్‌వేణి అందించగా ఆర్య సాయి కృష్ణ కెమెరామెన్‌గా పనిచేస్తున్నారని తెలిపారు. డాక్యుమెంటరీని అక్టోబర్‌లో విడుదల చేస్తామని ఎగ్జిక్యూటివ్ మేనేజర్ పి.శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# అమ్మా.. నువ్వు లేక!




కల్లూరు, ఆగస్టు 25(టుడే విదుర): ఆ గున్న ఏనుగుకు 40 రోజులుగా అమ్మ ఆలనా పాలన దూరమైంది. మందలో తిరుగుతున్నా ఒంటరే అయింది. అమ్మ పాలు లేక.. ఆహారం సరిగా అందక మరణించింది. గున్న ఏనుగు కళేబరాన్ని పది రోజుల తర్వాత గుర్తించిన అటవీశాఖ అధికారులు ఈ అభిప్రాయానికి వచ్చారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పులిచెర్ల మండలంలోని పాతపేట పంచాయతీ చిట్టెరెడ్డిపేట సమీపంలో జూలై ఐదో తేదీ రాత్రి పంటలను ధ్వంసం చేస్తున్న ఓ తల్లి ఏనుగు ప్రమాదవశాత్తూ మృతి చెందింది. ఈ ఏనుగు అప్పటికే ఓ గున్న ఏనుగుకు జన్మనిచ్చింది. దానికి నెల వయసు ఉ ంటుంది. తల్లి చనిపోయాక మిగిలిన ఏనుగులతో కలిసి అడవిలోకి వెళ్లిపోయింది. అప్పటినుంచి దానికి తల్లి పాలు లేకపోవడం, ఆహారం సరిగా అందలేదు. తల్లి ఏనుగుపై బెంగ పెట్టుకుంది. ఈ నేపథ్యంలో పది రోజుల కిందట పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ సరిహద్దులోని సైదుల్లా గుట్ట అటవీ ప్రాంతంలో మృతి చెందింది. అటవీ ప్రాంతం కావడంతో ఎవరూ గుర్తించలేదు. అడవిలో గొర్రెలు మేపుతున్న కాపరులు సాయంత్రం గున్న ఏనుగు కళేబరాన్ని గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం ఉదయం తిరుపతి డీఎఫ్‌వో వివేక్, ఎఫ్ఆర్‌వో మాధవి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, కళేబరాన్ని పరిశీలించారు. తిరుపతి జూపార్కు వైద్యులు తోహెబాసింగ్ ఆధ్వర్యంలో గున్న ఏనుగు కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి, అక్కడే దహనం చేశారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో వివేక్ మాట్లాడుతూ.. తల్లిపాలు లేకపోవడం, ఆహారం సరిగా అందకపోవడంతోనే మృతి చెందినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. పూర్తి వివరాలు పోస్టుమార్టం నివేదికలో వెల్లడవుతాయని చెప్పారు. ఎఫ్ఎస్‌వో భారతి, ఎఫ్‌బీవో జమున, ట్రాకర్స్ పాల్గొన్నారు.

# పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులకు చెక్



ఆగిరిపల్లి, ఆగస్టు 25(టుడే విదుర): పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగాఆగిరిపల్లి మండ లం శోభనాపురం శివారు బొద్దానపల్లి పంచాయతీలో వీధులను శుభ్రం చేసి డ్రెయిన్లలో పూడికను తొలగించారు. అనంతరం జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. ‘వ్యాధులకు మూలం అపరిశు భ్రత వాతావరణం. రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.25 వేల కోట్లకు పైగా ప్రజారోగ్య పరిరక్షణకు ఖర్చు చేస్తోంది. పరిశుభ్రత ప్రతీ ఒక్కరి జీవితంలో భాగంగా కావాలి. పెన్షన్‌లకు ఏటా రూ.34 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. రాష్ట్రంలో 65 లక్షల మంది విభిన్న ప్రతిభావంతులకు పెన్షన్లు అందిస్తున్నాం. దొంగ సర్టిఫికెట్లతో పెన్షన్లు పొందేవారిని గుర్తించేందుకు పరిశీలన కార్యక్రమం చేపట్టాం’ అన్నారు. సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న మాట్లాడుతూ ప్రతీ నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపడుతున్నామన్నారు. బొద్దనపల్లిలోని పారిశుధ్య కార్మికులు సీతారాంబాబు, పేరంటమ్మలను మంత్రి సన్మానించి రూ.ఏడు వేలు బహుమతిగా అంద జేశారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రమాదవశాత్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు బీమా సొమ్మును అందజేశారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో భార్గవి, టీడీపీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, శోభనాపురం పీఏసీఎస్ ఛైర్మన్ నలజాల హరిబాబు, హెచ్‌ఎం యామిని కృష్ణప్రియ, తదితరులు పాల్గొన్నారు.

# మేడిపల్లి హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి..




ఆగస్టు 25(టుడే విదుర): మేడిపల్లి హత్య కేసులో సంచలన విషయాలు బయటకు వచ్చాయి. స్వాతిని చంపేందుకే వికారాబాద్ నుంచి హైదరాబాద్ తీసుకొచ్చానని మహేందర్ రెడ్డి పోలీసుల విచారణలో వెల్లడించాడు. రెండు నెలల క్రితమే హైదరాబాద్ షిఫ్ట్ అయ్యామని తెలిపాడు. ప్రేమించి పెళ్లి చేసుకున్నప్పటికీ మహేందర్ కు భార్యపై విపరీతమైన అనుమానం ఉండేది. స్వాతి గర్భవతి అయినప్పటి నుంచి ఈ అనుమానం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలోనే స్వాతిని అత్యంత కిరాతకంగా నరికి చంపానని మహేందర్ అంగీకరించాడు.ఇంటి ఓనర్స్ లేని సమయం చూసి భార్య హత్యకు ప్లాన్ చేశాడు. అనుకున్న ప్రకారం స్వాతిని చంపేసి శరీర భాగాలని రంపంతో ముక్కలుగా ముక్కలుగా కోశాడని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన ప్రకారం, కాళ్లు, చేతులు, తల భాగాలను కవర్లో ప్యాక్ చేసి తీసుకెళ్లి మూసీలో పడవేశాడు. పొట్ట భాగాన్ని మాత్రం కట్ చేయకుండా ఇంట్లోనే ఉంచాడు. దీంతో ఇంటి నుంచి తీవ్రమైన దుర్వాసన రాసాగింది. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించారు.


# 6 బ్యాంకు ఖాతాల్లో 2 నెలల్లో రూ.155.90 కోట్ల లావాదేవీలు




హైదరాబాద్, ఆగస్టు 25(టుడే విదుర): సైబర్ నేరగాళ్లకు ఇతరుల బ్యాంకు ఖాతాలను అందిస్తూ.. రూ.కోట్లలో అక్రమ లావాదేవీలు చేస్తున్న కేటుగాడు వడ్డేపల్లి లలిత్ శరణ్ కుమార్‌ను సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్బీ) అధికారులు నేపాల్ సరిహద్దుల్లో అరెస్టు చేశారు. విజయవాడ వాసి శరణ్ కుమార్ దుబాయ్ కేంద్రంగా సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలను సమకూరుస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైందని సీఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్ ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది శరణ్ కుమార్ హైదరాబాద్ షంషీర్‌గంజ్‌లోని ఎస్బీఐ బ్యాంకులో కరెంట్ ఖాతాలు నిర్వహిస్తున్న ఆరుగురు వ్యక్తులను సంప్రదించి.. సైబర్ నేరగాళ్లకు సహకరించడానికి ఒప్పించాడని, గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో 6 ఖాతాల్లో రూ. 155.90కోట్ల మేర లావాదేవీలు జరిగాయని ఆమె వివరించారు. సైబర్ నేరాల్లో బాధితులైన 611 మంది ఖాతాల నుంచి కొల్లగొట్టిన డబ్బును శరణ్ కుమార్ మళ్లించి, ఆ తర్వాత సైబర్ కేటుగాళ్లకు పంపాడని చెప్పారు. అప్పట్లో ఈ కేసుకు సంబంధించి ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్‌తో పాటు ఆరుగురిని అరెస్టు చేసినట్లు గుర్తుచేశారు. నాటి నుంచి దుబాయ్‌కి పరారైన శ్రవణ్‌పై లుకౌట్ నోటీసు జారీ చేశామని శిఖా గోయల్ తెలిపారు. దుబాయ్ నుంచి నేపాల్ మీదుగా దేశం లోకి రావడానికి ప్రయత్నిస్తున్న శరణ్‌ను సునౌలీ చెక్‌పోస్టు వద్ద అరెస్టు చేశామని చెప్పారు. త్వరలో కోర్టు అనుమతితో శరణ్‌ను విచారిస్తామన్నారు.


# సైబరాబాద్‌లో షీ టీమ్స్ డెకాయ్ ఆపరేషన్స్.. 70 మంది అరెస్ట్..

సైబరాబాద్‌ఆగస్టు 25(టుడే విదుర): బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, పిల్లల సంరక్షణ కోసం సైబరాబాద్ షీ టీమ్స్ చురుగ్గా పనిచేస్తున్నాయి. బస్టాపులు, రోడ్లు వంటి రద్దీ ప్రదేశాల్లో ఆవారాగాళ్లు, చైన్ స్నాచర్ల ఆగడాలకు కళ్లెం వేసేందుకు నిత్యం మఫ్టీలో సంచరిస్తూ ఓ కన్నేసి ఉంచుతున్నారు. ఇంటా బయటా మహిళలు, చిన్న పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురిచేస్తున్న ఆకతాయిల భరతం పడుతున్నాయి. తాజాగా సైబరాబాద్ షీ టీమ్స్ నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్లలో ఏకంగా 70 మంది అరెస్ట్




అయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సైబరాబాద్‌లో షీ టీమ్స్ ఇటీవల143 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించింది. మహిళలను, చిన్న పిల్లలతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, వేధింపుల గురిచేస్తున్న 70 మంది ఆకతాయిలనురెడ్ హ్యాండెడ్ గా పట్టుకుంది. .

# వివాహేతర సంబంధం అనుమానంతో భార్యను కడతేర్చిన భర్త



పెద్దకొత్తపల్లి/మహబూబ్‌నగర్,ఆగస్టు 25(టుడే విదుర):ఓ యువకుడు తన భార్యకు వివాహేతర సంబం ధం ఉందనే అనుమానంతో అడవిలోకి తీసుకెళ్లి హత్యచేసి, అనంతరం పెట్రోల్ పోసి కాల్చేసిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలో జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని కొత్తరాయవరం గ్రామానికి చెందిన శ్రీశైలం, దేవరకద్రకు చెందిన శ్రావణి (27) పదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో శ్రావణి కొన్నాళ్లుగా పిల్లలతో కలిసి మహబూబ్‌నగర్‌లో నివాసం ఉంటోంది. శ్రీశైలం హైదరాబాద్‌లోని యూసుఫగూడలో వెల్డర్‌గా పని చేస్తున్నాడు. భార్యకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో తరుచూ ఆమెతో గొడవ పడేవాడు.విసిగిపోయిన ఆమె జనవరిలో మహిళా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో సోమశిలకు వెళ్దామని నమ్మించిన శ్రీశైలం ఈ నెల 21న మహబూబ్‌నగర్‌కు వచ్చి, భార్యను బైక్‌పై తీసుకెళ్లాడు. పథకం ప్రకారం కత్తి, పెట్రోల్‌ను బైక్ కవర్‌లో ఉంచుకున్నాడు. పెద్దకొత్తపల్లి మండలంలోని సాతాపూర్ అడవిలోకి తీసుకెళ్లి కత్తితో పొడిచి హత్య చేశాడు. తర్వాత మృతదేహానికి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. కూతురు నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో అనుమానించిన ఆమె తల్లి శనివారం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదేరోజు రాత్రి శ్రీశైలం పోలీసుల వద్ద లొంగిపోయాడు.

# నీటిలో విషం కలిపిన టీచర్‌పై హత్యాయత్నం కేసు




భూపాలపల్లిటౌన్, ఆగస్టు 25(టుడే విదుర): తాగునీటిలో విషం కలిపి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడిన భూపాలపల్లి అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల ఉపాధ్యాయుడు పెండ్యాల రాజేందర్‌పై హత్యాయత్నం కేసు నమోదైంది. అతడిని పోలీసులుఅరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాలనుసారం ఈ చర్యలు తీసుకున్నట్లు డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. మరోవైపు రాజేందర్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈ నెల 21 రాత్రి తాగునీటి ట్యాంకులో ఉపాధ్యాయుడు రాజేందర్ గడ్డి మందు కలిపినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.హాస్టల్ ప్రత్యేక అధికారిపై నెపాన్ని నెట్టేందుకు కుట్ర చేసినట్లు తేలింది. ఈ ఘటనలో 11 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకున్నారు. విద్యార్థులపై విష ప్రయోగానికి పాల్పడిన రాజేందర్‌ను కఠినంగా శిక్షించాలని మానవ హక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అ?ధ్యక్షుడు దిలీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కాటేపల్లి టైర్ల రీసైక్లింగ్ పరిశ్రమలు మూసివేయాలి



పంజాగుట్ట, ఆగస్టు 25(టుడే విదుర): యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి, దాని పరిసర గ్రామాలలో కాలుష్యాన్ని వెదజల్లుతున్న టైర్ల రీసైక్లింగ్ పరిశ్రమలను మూసివేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలు, వ్యవసాయ భూములను కాపాడాలని కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కాటేపల్లి, పొరుగు పల్లెలను కాష్టంలో కాలుస్తున్నటైర్ల రీసైక్లింగ్ పరిశ్రమల కాలుష్యంపై అఖిలపక్ష సమావేశం జరిగింది. తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జస్టిస్ బి.చంద్ర కుమార్, బీఆర్ఎస్ నాయకురాలు తుల ఉమ, మాజీ ఎమ్మెల్యే వి.శ్రీరాములు, శాస్త్రవేత్త ప్రొఫెసర్ బాబూరావు, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి తదితరులు పాల్గొని మాట్లాడారు. పర్యావరణ నిబంధనల ప్రకారం ఇటువంటి పరిశ్రమలను పారిశ్రామిక వాడలలో ఏర్పాటు చేయాలని, కానీ చట్టాలకు విరుద్ధంగా వ్యవసాయ భూములలో స్థాపించారని వారు తెలిపారు.అక్రమ పద్ధతుల్లో కాలుష్య నియంత్రణ మండలి నుంచి సర్టిఫికెట్లు పొంది ఈ పరిశ్రమలను నడిపిస్తున్నారని ఆరోపించారు. పరిశ్రమల నుంచి వచ్చే దట్టమైన పొగ, నల్లటి బూడిద, భరించలేని దుర్వాసన వల్ల స్థానికులు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లటి బూడిద వల్ల పంటలు, కూరగాయలు, పండ్ల తోటలు దెబ్బతిని మార్కెట్లో వాటికి సరైన ధర లభించడం లేదని రైతులు తెలిపారు. పరిశ్రమల నిర్మాణ సమయంలోనే వాటిని అడ్డుకున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదని గ్రామ ప్రజలు ఆరోపించారు. ఎనిమిది నెలలుగా ఈ సమస్యతో బాధపడుతున్నా ఎవరూ స్పందించడం లేదని వారు వాపోయారు. కాలుష్యం వెదజల్లుతున్న ఈ పరిశ్రమలను వెంటనే మూసి వేయకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# మద్యం తాగి వేధిస్తున్నాడని భర్తపై భార్య దాడి

పెనుబల్లి, :ఆగస్టు 25(టుడే విదుర): మద్యం తాగి తరచూ వేధిస్తున్నాడని భర్తపై భార్య దాడి చేసిన ఘటన ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వీఎం బంజర్ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన పర్వతం గంగరాజుకు లక్ష్మీతో 25 ఏళ్ల క్రితం వివాహమైంది. గంగరాజు ఇటీవల తరచూ మద్యం తాగి ఇంటికి వచ్చి భార్య, పిల్లలతో గొడవ పడుతున్నాడు. దీంతో భార్యభర్తల మధ్య కొంత కాలంగా ఘర్షణలు జరుగుతున్నాయి.శనివారం మద్యం తాగి ఇంటికి వచ్చిన గంగరాజు.. భార్య



లక్ష్మీతో గొడవకు దిగాడు. ఎదురుతిరిగిన లక్ష్మీ.. భర్త గంగరాజు నోట్లో గుడ్డలు కుక్కి దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన గంగరాజును పెనుబల్లి ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

# మత్తు మందు ఇచ్చి బాలికపై అత్యాచారం

కొత్తగూడెం, :ఆగస్టు 25(టుడే విదుర):అభం శుభం తెలియని ఓ గిరిజన బాలిక. తన కుటుంబ సభ్యులను చూడాలనుకుని ఎంతో ఆనందంతో స్వగ్రామానికి బయలుదేరింది. తన అన్నయ్యకు ఫోన్ చేసి ఇంటికి వస్తున్నానని చెప్పింది. అలాంటి బాలిక ఉసురు తీశారు కొందరు నీచులు. కన్నూమిన్నూ కానక.. ఆ 17ఏళ్ల బాలికపై అత్యాచారానికి ఒడిగట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రాత్రి చోటు చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏపీలోని యేటపాక మండలానికి చెందిన ఆదివాసీ బాలికకు రెండేళ్ల క్రితం ఛత్తీసగఢ్‌లోని సుక్మా జిల్లాకు చెందిన యువకుడితో వివాహం జరిగింది. గతంలోనే బాలిక తల్లిదండ్రులు చనిపోగా.. పుట్టింటి వద్ద ఉంటున్న బంధువులను కలిసేందుకు కుంట మండల కేంద్రానికి చేరుకుంది. అక్కడి నుంచి ప్యాసింజర్ ఆటో ఎక్కింది. అప్పటికే ఆటోలో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి ఉన్నట్లు సమాచారం. మార్గ మధ్యలో ఆ ఇద్దరు వ్యక్తులు మద్యం తాగడంతో పాటు బాధితురాలికి మత్తు మందు కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చి అత్యాచారానికి పాల్పడ్డారు. పాల్వంచ మండలం జగన్నాథపురం వద్ద అపస్మారక స్థితిలో ఉన్న సదరు బాలికను గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. బాలిక చెప్పిన వివరాల ఆధారంగా ఆమెపై అత్యాచారం జరిగినట్టుగా అనుమానించిన అధికారులు పాల్వంచ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీడీపీవో లక్ష్మీప్రసన్న ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. బాలికను సంరక్షణ కేంద్రానికి తరలించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# టుడే వినోదం

## రజనీతో.. నాగ్ అశ్విన్ సినిమా!
### సోషల్ మీడియా షేక్




టాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన కాంబినేషన్‌కు తెర లేచింది. ఇప్పుడీ వార్త సోషల్ మీడియాలో దుమ్ము రేపుతుండగా సినీ లవర్స్ లో అంతకుమించి క్యూరియాసిటీని నింపుతోంది. వావరాల్లోకి వెళితే.. గత సంవత్సరం కల్కి సినిమాతో వరల్డ్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన మహానటి ఫేం నాగ్ అశ్విన్ ఇప్పుడు సూపర్ స్టార్ రజనీకాంత్ కాంబోలో త్వరలో ఓ సినిమా పట్టాలెక్కబోతున్నట్లు తమిళ, తెలుగు మీడియాల్లో టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే సరిపోదా శనివారం ఫేం దర్శకుడు వివేక్ ఆత్రేయ సైతం రజనీ కాంత్‌తో ఓ సినిమా చర్చ జరుగుతుందని చాలా రోజులుగా చర్చ నడుస్తున్న సమయంలో సడన్‌గా ఇప్పుడు ఈ వార్త మరింత ప్రాధాన్యత సంతరించుకుందిభారీ బడ్జెట్‌తో, అద్భుతమైన టెక్నికల్ వాల్యూస్‌తో రూపొందనున్న ఈ సినిమాను తన హోం బ్యానర్, తెలుగు చిత్ర పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మక బ్యానర్ అశ్వినీదత్ ఆధ్వర్యంలోని వైజయంతి మూవీస్‌నిర్మించనున్నట్లు సమాచారం. ఇప్పటికే నాగ్ అశ్విన్ రజనీ కాంత్‌ను కలిసి స్టోరీ డిస్కస్ చేసినట్లు రజనీ సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, డెవలప్ చేయమని చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. సోషల్ మీడియాలో ఇప్పటికే హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండ్ అవుతున్నాయి.అయితే.. ప్రస్తుతం నాగ్ అశ్విన్ కల్కి పార్ట్ 2 తీసేందుకు ఉపక్రమిస్తున్న సమయంలో ఇప్పుడీ వార్త సౌత్ ఇండియాను ఊపేస్తుంది. ఒకవేళ ఈ కాంబో పట్టాలెక్కితే కల్కి 2 వాయిదా పడుతుంది అనే ఊహాగానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదిలాఉంటే.. వైజయంతి మూవీస్ అశ్వినీ దత్‌కు రజనీకాంత్‌తో మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయి. రజనీకాంత్ చివరిగా తెలుగులో నటించిన సినిమా కథానాయకుడు ఈ బ్యానర్ నుంచే రావడం గమనార్హం. అంతేగాక చాలాకాలం తర్వాత కమల్ హసన్ ) ఈ బ్యానర్ తోనే తెలుగులో కల్కి సినిమాలో నటించగా ఇప్పుడు రజనీ కాంత్ సైతం ఈ బ్యానర్ ద్వారానే తెలుగులో సినిమా చేయనుండడం విశేషం. అనుకున్న ప్రకారం ఈ సినిమా ఓకే అయితే.. ఈ ప్రాజెక్ట్ ఇండియన్ సినిమా హిస్టరీలో మరో ఎపిక్‌గా మారే అవకాశం ఉంది.



## సీనియర్ కార్టూనిస్టు దర్శకుడు
### శంకు కన్నుమూత




సీనియర్ వ్యంగ్య చిత్రకారుడు, రచయిత, దర్శక, నిర్మాత సంపర భీమ శంకర కుమార్ అలియాస్ శంకు(78) ఇకలేరు. ఆయన ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో గుండెపోటుతో బాగ్ అంబర్ పేటలోని స్వగృహంలో హఠాన్మరణం చెందారు. శంకు స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా తణుకు. బాపూ బొమ్మల స్ఫూర్తితో 1962లో తన 16వ ఏట కుంచె పట్టిన శంకు ఆంధ్ర పత్రికకు రెండు దశాబ్దాలు బొమ్మలు, కార్టూన్లు గీశారు. ఉన్నత విద్య అనంతరం ప్రఖ్యాత దర్శకుడు బాపు దగ్గర తొమ్మిది సినిమాలకు దర్శకత్వ శాఖలో పని చేశారు. ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో కొంతకాలం పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. 'మిస్టర్ పెళ్లాం' సినిమాకు నిర్మాతగా వ్యవహరించినా, ఉద్యోగ నిబంధనల కారణంగా టైటిల్స్ లో మాత్రం సహ నిర్మాతగా వేయించినట్లు తానే ఓ సందర్భంలో చెప్పారు. మునిమాణిక్యం 'కాంతం కథలు', శంకరమంచి 'అమరావతి కథలు' , వంశీ 'మా పసలపూడి కథలు', సయ్యద్ సలీం కథలను టెలివిజన్ ధారావాహికలుగా రూపొందించారు. అందుకుగాను నాలుగు నంది పురస్కారాలు అందుకున్నారు. తెలుగు కార్టూనిస్టులందరినీ ఒక వేదిక మీదకు తీసుకురావడంలో శంకు ప్రముఖ పాత్ర పోషించారు. దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన 13 మంది కార్టూనిస్టుల జీవితంపై 'ఎమినెంట్ కార్టూనిస్ట్స్ ఆఫ్ ఇండియా' పేరుతో దూరదర్శన్‌కు డాక్యుమెంటరీ చిత్రాలు తీశారు.

## బాలకృష్ణకు.. పవన్ ప్రశంసలు





%నందమూరి బాలకృష్ణకు తాజాగా అరుదైన గౌరవం దక్కిన విషయం తెలిసిందే.. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గోల్డ్ ఎడిషన్‌లో ఆయన పేరు నమోదైంది. భారతీయ చలన చిత్ర పరిశ్రమలో ఈ పురస్కారానికి ఎంపికైన తొలి నటుడిగా నిలిచారు బాలయ్య. సినీ ఇండస్ట్రీలో నటుడిగా 50 వసంతాలు పూర్తి చేసుకున్నారాయన. సినిమా ఇండస్ట్రీకి ఆయన చేసిన సేవలను గుర్తించి ఆయనకు ఈ పురస్కారాన్ని అందించనున్నారు. . ఈ నెల 30న బాలయ్యను ఈ పురస్కారంతో సత్కరించనున్నారు. %నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న ఈ తరుణంలో ఈ గుర్తింపు దక్కడం ఆయన కెరీర్‌కు ఓ మైల్‌స్టోన్ అనే చెప్పాలి. అయితే.. టాలీవుడ్‌కు బాలకృష్ణ చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. ఇప్పుడు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడంపై అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అభిమానులు, సెలెబ్రిటీలు బాలయ్యకు శుభాకాంక్షలు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కల్యాణ్ సైతం సోషల్ మీడియా ద్వారా బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన సినిమాకు చేసిన సేవలను కొనియాడారు.

## కల్యాణి, నస్లేన్.. 'లోకా' ట్రైలర్ చూశారా!
### పెద్దగానే ప్లాన్ చేశారుగా




మలయాళీ ముద్దుగమ్మ కల్యాణి ప్రియదర్శన్ లీడ్ రోల్‌లో తెరకెక్కుతున్న చిత్రం లోకా ఛాప్టర్ 1 చంద్ర తెలుగులో కొత్త లోకగా విడుదల కానుంది. సూపర్ హీరో జానర్‌లో రూపొందిన ఈ చిత్రంలో ప్రేమలు హీరో నస్లేన్ కీలక పాత్రలో నటించగా అగ్ర హీరో దుల్కర్ సల్మాన వేఫరార్ సంస్థ నిర్మించింది. డామ్నిక్ అరుణ్ దర్వకత్వం వహించాడు.కాగా.. ఈ చిత్రం ఓనమ్ పండుగను పురస్కరించుకుని సెప్టెంబర్ మొదటి వారంలో పాన్ ఇండియాగా మలయాళంతో పాటు తెలుగు ఇతర భాషల్లోనూ థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రచార కార్యక్రమాలు షురూ చేస్తూ ఆదివారం సాయంత్రం టీజర్ విడుదల చేశారు. రెండు నిమిషాల 13 సెకండ్లు ఉన్న ఈ ట్రైలర్ చూస్తుంటే మలయాళీలు ఏదో గట్టిగానే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుత కాలానికి, భూత కాలానికి లింక్ రచేస్తూ సూపర్ పవర్స్ ఉన్న చంద్ర నేపథ్యంలోనే సినిమా ఉండనున్నట్లు అర్థమవుతోంది.

## ఇది నా ఊరు సార్.. నేను వదలను



కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ వరుస సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెల్సిందే. అమరన్ లాంటి హిట్ సినిమా తరువాత శివ కార్తికేయన్ నుంచి వస్తున్న సినిమా మదరాశి స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను శ్రీ లక్ష్మీ మూవీస్ నిర్మిస్తుంది. ఇక ఈ సినిమాలో శివ కార్తికేయన్ సరసన రుక్మిణి వసంత్ నటిస్తుండగా.. బాలీవుడ్ హీరో విద్యుత్ విలన్ గా నటిస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా మదరాశి సినిమా ట్రైలర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు.మదరాశి ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది. యాక్షన్ ఎంటర్ టైనర్ గా ఈ సినిమా తెరకెక్కిందని ట్రైలర్ ను బట్టి తెలుస్తోంది. 'నీలాగే ఇతరులను ప్రేమించు.. అందరూ నీ కుటుంబమే అనుకో.. అదే అందరూ దేవుళ్లు చెప్పింది' అని రుక్మిణి వసంత్ చెప్పే డైలాగ్ తో ట్రైలర్ మొదలయ్యింది. ఈ సినిమాలో రఘు అనే పోలీస్ ఆఫీసర్ గా శివ కార్తికేయన్ కనిపించాడు. ప్రేమించిన అమ్మాయితో ఎంతో హ్యాపీగా ఉండే రఘు జీవితం ఒక్క బాంబ్ తో బ్లాస్ట్ తో తల్లకిందులవుతుంది. ఆ బాంబ్ బ్లాస్ట్ తరువాత రఘు జీవితంలో ఏం జరిగింది.. ? దేనికోసం అతడు అంతలా పోరాడుతున్నాడు.. ? బాంబ్ బ్లాస్ట్ తో విద్యుత్ కు ఉన్న సంబంధం ఏంటి.. తన సొంత ఊరును వదిలి వెళ్లమని రఘును ఎవరు బెదిరించారు అనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.


## సినీ దర్శకనిర్మాతలతో సీఎం భేటీ.. ఏమన్నారంటే



టాలీవుడ్ సినీ దర్శకనిర్మాతలు తాజాగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారందరిని సీఎం రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా ఆహ్వానించి వారి సమస్యలను సహనంగా విన్నారు. ఇండస్ట్రీలో గత కొన్నిరోజులుగా జరుగుతున్న అన్ని పరిణామాల గురించి వారు సీఎం రేవంత్ రెడ్డి ముందు పెట్టడం జరిగింది. ఇక భేటీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ' సినిమా పరిశ్రమలో చక్కటి పని వాతావరణం ఉండాలి. సినిమా కార్మికులను కూడా నేను పిలిచి మాట్లాడుతాను. ప్రభుత్వం నుంచి సినిమా పరిశ్రమకు ఎల్లప్పుడూ పూర్తి సహకారం ఉంటుంది. పరిశ్రమలోకి కొత్తగా వచ్చే వారికి నైపుణ్యాలు పెంచేలా చర్యలు తీసుకోవాలి. పరిశ్రమలో వివిధ అంశాల్లో నైపుణ్యాల పెంపు కోసం ఒక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తే బాగుంటుందనుకుంటున్నాను. స్కిల్ యూనివర్సిటీ లో సినిమా పరిశ్రమ కోసం కావాల్సిన ఏర్పాట్లు చేస్తాం.తెలుగు సినిమా పరిశ్రమ అంతర్జాతీయ స్థాయికి వెళ్లింది. తెలంగాణలో ముఖ్యమైన పరిశ్రమ సినిమా పరిశ్రమ.



# క్రీడావార్తలు



# టీమ్ ఇండియాకు కొత్త స్పాన్సర్ షిప్.. పోటీలో టయోటా, ఫిన్‌టెక్ స్టార్టప్



టీమ్ ఇండియా క్రికెట్‌కు సంబంధించి ఒక హాట్ హాట్ న్యూస్ వచ్చేసింది. మన ఇండియన్ క్రికెట్ టీమ్‌కి టైటిల్ స్పాన్సర్‌గా ఉన్న డ్రీమ్11 తాజాగా షాకింగ్ నిర్ణయం తీసుకుంది. ఇకపై టీమ్ ఇండియాకు స్పాన్సర్ చేయమని చెప్పింది. దీంతో కొత్త స్పాన్సర్ కోసం వేట మొదలెట్టింది. %ఈ క్రమంలోనే సెప్టెంబర్ 9 నుంచి యూఏఈలో జరగబోయే ఆసియా కప్‌కి ముందు ఈ స్పాన్సర్‌షిప్ హడావిడి మొదలైంది. డ్రీమ్11 ఎందుకు వెనక్కి తగ్గిందంటే, ఇటీవల పార్లమెంట్‌లో ఆన్‌లైన్ గేమింగ్ రెగ్యులేషన్ బిల్ ఆమోదం పొందింది. ఈ బిల్ కారణంగా డ్రీమ్11 %దీజజ×%కి తమ నిర్ణయాన్ని తెలియజేసింది. ఈ క్రమంలో రెండు పెద్ద సంస్థలు టీమ్ ఇండియాకు స్పాన్సర్ కోసం ముందుకొచ్చాయని నివేదికలు చెబుతున్నాయి. వాటిలో ఒకటి టయోటా మోటార్ కార్పొరేషన్, రెండోది ఒక ఫిన్‌టెక్ స్టార్టప్. టయోటా లాంటి గ్లోబల్ బ్రాండ్, ఇంకోవైపు కొత్తగా ఊపందుకుంటున్న ఫిన్‌టెక్ స్టార్టప్ ఈ రెండూ రేసులో ఉన్నాయి. కానీ ఇంకా అధికారిక టెండర్ ప్రాసెస్ మొదలు కాలేదు. ఇక ఆసియా కప్ జెర్సీల విషయానికొస్తే, డ్రీమ్11 లోగోతో జెర్సీలు ఇప్పటికే ప్రింట్ అయిపోయాయట. కానీ, ఈ కొత్త అప్?డేట్ కారణంగా ఆ జెర్సీలు ఆసియా కప్‌లో ఉపయోగించరు. ఇప్పుడు %దీజజ×% కొత్త స్పాన్సర్ లోగోతో జెర్సీలు తయారు చేయాల్సి ఉంటుంది. %దీజజ×% సెక్రటరీ దేవజిత్ సైకియా ఈ విషయంపై స్పందిస్తూ మేం దేశంలోని చట్టాలను పాటిస్తాం. ఒకవేళ ఏదైనా అనుమతించబడకపోతే, మేం దాన్ని చేయమని అన్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రతి విధానాన్ని %దీజజ×% అనుసరిస్తుందన్నారు. ఆసియా కప్ సెప్టెంబర్ 9న దుబాయ్, అబుదాబిలలో మొదలై, సెప్టెంబర్ 28న ఫైనల్‌తో ముగుస్తుంది. దీంతో ఇప్పుడు కొత్త స్పాన్సర్ ఎవరవుతారన్న దానిపైనే ఆసక్తి నెలకొంది. టయోటా లాంటి జెయింట్ గెలుస్తుందా? లేక ఫిన్‌టెక్ స్టార్టప్ సర్‌ప్రైజ్ ఇస్తుందా అనేది చూడాలి మరి.

# నయా వాల్ నిష్క్రమణ





చటేశ్వర్ పుజార.. టెస్టు క్రికెట్‌కు అసలు సిసలైన పర్యాయపదం. యుద్ధభూమిలో సైనికుడి మాదిరి పట్టుదల, ఓర్పు అతడి సొంతం. ఓవైపు వికెట్లు పడుతున్నా నేనున్నాగా అనే భరోసాతో క్రీజులో గంటలకొద్దీ పాతుకుపోయి అతనాడిన ఇన్నింగ్స్ ఎన్నెన్నో. అతడికి బంతులు వేసీ వేసీ బౌలర్ల భుజాలు నొప్పి పుట్టాల్సిందేగానీ అతను మాత్రం అంత సులువుగా పెవిలియన్ చేరడు. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలో బౌన్సీ, సీమ్ పిచ్‌లపై పేసర్ల బుల్లెట్‌లాంటి బంతులకు ఒళ్లు హూనమవుతున్నా బెదరకుండా శతకాలతో జట్టును గెలిపించిన ధీరుడు. టీమిండియా నయా వాల్‌గా మన్ననలందుకున్న ఈ సౌరాష్ట్ర హీరో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. న్యూఢిల్లీ: భారత క్రికెట్‌లో సీనియర్ల రిటైర్మెంట్ కొనసాగుతూనే ఉంది. తాజాగా చటేశ్వర్ పుజార 15 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకొంటున్నట్టు ఆదివారం సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు. సౌరాష్ట్రకు చెందిన 37 ఏళ్ల పుజార 2010లో ఆస్ట్రేలియాపై బెంగళూరులో టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. దశాబ్దానికి పైగా వన్‌డౌన్ స్థానంలో జట్టుకు నమ్మదగ్గ బ్యాటర్‌గా సేవలందించాడు. ఈక్రమంలో జట్టుకు ఇంటా, బయటా చిరస్మరణీయ విజయాలు అందించాడు. కెరీర్‌లో ఆడిన 103 టెస్టుల్లో 43.60 సగటుతో 7,195 పరుగులు సాధించాడు. ఇందులో మూడు డబుల్ సెంచరీలు, 16 శతకాలున్నాయి. ఇక ఐదు వన్డేల్లో 51 పరుగులున్నాయి. జూన్, 2023లో జరిగిన వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప ఫైనల్ మ్యాచ్ పుజార కెరీర్‌లో చివరిది. ఆ తర్వాత కొత్త తరం ఆటగాళ్లపై మేనేజ్‌మెంట్ దృష్టి సారించడంతో అతనికి ద్వారాలు మూసుకుపోయాయి. అయినా దేశవాళీల్లో సౌరాష్ట్ర, కౌంటీల్లో ససెక్స్ తరఫున కొనసాగాడు. ఓవరాల్‌గా కెరీర్ మొత్తంలో పుజార 278 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 51.82 సగటుతో 66 శతకాలు, మూడు ట్రిపుల్ సెంచరీలతో 21,301 పరుగులు చేశాడు. ద్రవిడ్ రిటైర్మెంట్ తర్వాత మూడో స్థానంలో పుజార జట్టుకు ఆశాకిరణంగా మారాడు. 2012, జూన్‌లో తొలి టెస్టు సెంచరీ కొట్టాడు. రెండు నెలల తర్వాత స్వదేశంలోనే ఇంగ్లండ్‌పై తొలి డబుల్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. అయితే క్రీజులో సుదీర్ఘ సమయం గడపడంలో తనను మించిన వారు లేరనే చెప్పవచ్చు.

# చికిత స్వర్ణ చరిత్ర




విన్నిపెగ్ (కెనడా): తెలుగమ్మాయి, యువ ఆర్చర్ తానిపర్తి చికితరావు స్వర్ణ చరిత్ర సృష్టించింది. ఆదివారం కెనడాలో ముగిసిన ఆర్చరీ ప్రపంచ యూత్ చాంపియన్‌షిప కాంపౌండ్ విభాగం అండర్-21లో చికిత పసిడి పతకం కొల్లగొట్టింది. ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా ఆర్చర్ చికితానే కావడం విశేషం. హెూరాహెూరీగా సాగిన ఫైనల్లో 20 ఏళ్ల చికిత 142-133తో స్పెయిన్ ఆర్చర్ పౌలా డియాజ్ మోరిల్లాసపై విజయం సాధించింది. అంతకుముందు సెమీసలో చికిత 142-136తో పార్క్ యెరిన్ (రిపబ్లిక్ ఆఫ్ కొరియా)పై, క్వార్టర్స్‌లో ఆసియా చాంపియన్, భారత్‌కే చెందిన పర్నీత్ కౌర్‌పై 146-143తో గెలిచింది. ఇక, పురుషుల అండర్-18 టీమ్ ఈవెంట్‌లో తెలుగు సంతతికి చెందిన అమెరికా ఆర్చర్ నాళం సూరజ్ కార్తికేయ బృందానికి రజత పతకం లభించింది. సూరజ్ తల్లిదండ్రుల స్వస్థలం రాజమండ్రి. సూరజ్ కూడా గతంలో రాజమండ్రిలో శిక్షణ తీసుకొన్నాడు.

# అనిమేశ్ అదిరెన్



న్యూఢిల్లీ: యువ స్ప్రింటర్ అనిమేశ్ కుజుర్ రికార్డు సృష్టించాడు. 200 మీటర్ల రేసులో ప్రపంచ చాంపియన్‌షిప్ బెర్త్ దక్కించుకున్నాడు. చెన్నైలో జరుగుతున్న జాతీయ అంతరాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్‌షిపలో చత్తీసగఢ్‌కు చెందిన అనిమేశ్.. 200 మీటర్ల రేసును 20.63 సెకన్ల రికార్డు టైమింగ్‌తో అధిగమించి స్వర్ణం సాధించాడు. ఈ ప్రదర్శనతో ర్యాంకింగ్స్‌లో మెరుగైన అనిమేశ్.. వచ్చేనెల 13 నుంచి టోక్యో వేదికగా జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించాడు. ప్రపంచ టోర్నీలో 200 మీటర్ల రేసులో మొత్తం 48 మంది అథ్లెట్లు పోటీపడతారు. అయితే వీరిలో కొందరు కటాఫ్ టైమింగ్ (20.15 సెకన్లు)తో నేరుగా ప్రపంచ చాంపియన్‌షిపనకు ఎంపికైతే, మరికొందరికి ర్యాంకింగ్స్ ఆధారంగా బెర్త్ దక్కుతుంది. అంతరాష్ట్ర టోర్నీకి ముందు ప్రపంచ టోర్నీ రేసులో 42వ స్థానంలో ఉన్న అనిమేశ్.. తాజా ప్రదర్శనతో ర్యాంకింగ్స్‌లో ముందుకెళ్లి బెర్త్ సాధించినట్టు భారత అథ్లెటిక్స్ సమాఖ్య తెలిపింది. ఈ క్రమంలో ప్రపంచ చాంపియన్‌షిపనకు అర్హత సాధించిన తొలి పురుష స్ప్రింటర్‌గా 22 ఏళ్ల అనిమేశ్ చరిత్ర సృష్టించాడు.

# ఉక్కు సంకల్పం



ఆశలు కొడిగడుతున్న వేళ.. అలుపెరుగని యోధుడిలా అవకాశాలు సృష్టిస్తాడు. ప్రత్యర్థుల దెబ్బకు జట్టు అల్లకల్లోలమైనా.. నేనున్నానంటూ ధీశాలిలా ఎదురొడ్డుతాడు. ఓర్పు.. నేర్పుతో పరిస్థితులను చక్కదిద్దుతాడు.. తర్వాతి బ్యాటర్లకు భరోసాగా నిలుస్తాడు. అతడే భారత జట్టు నయా వాల్ చటేశ్వర్ పుజార. దశాబ్దానికిపైగా టీమిండియాకు పెట్టని కోటగా నిలిచిన పుజార శకం ముగిసింది. కోహ్లీలా కవర్ డ్రైవ్ ఆడలేడు.. రిషభ్ పంత్‌లా విధ్వంసం సృష్టించనూలేడు. బంతిని బలంగా బాదుతూ.. వీక్షకులకు వెర్రెత్తిస్తున్న టీ20 జమానాలో.. క్లాసిక్ క్రికెట్‌కు మచ్చుతునక! టీమిండియా వాల్ రాహుల్ ద్రవిడ్ రిటైరైనప్పుడు.. నేనున్నాంటూ జట్టుకు అండగా నిలిచాడు. నిస్వార్థం, ఉక్కు సంకల్పంతో.. మూడో నెంబర్‌లో గుబాళించాడు. ఆటగాడిగా పెద్దగా స్టార్‌డమ్ లేకపోవచ్చు.. అంతులేని అభిమాన గణం మాత్రం అతని సొంతం. ఫోర్లు, సిక్స్‌లు, స్ట్రయిక్ రేట్‌తో పుజార సేవలను కొలవలేం. జట్టు కోసం సర్వస్వం ధారపోస్తాడు. ప్రపంచంలోని అత్యుత్తమ బౌలింగ్‌ను ఎదుర్కొని.. జట్టును ప్రమాదం నుంచి గట్టెక్కించేందుకు శతవిధాలా పాటుపడతాడు. బుల్లెట్ లాంటి బంతులు శరీరాన్ని తాకుతున్నా.. అదరడు.. బెదరడు. కోహ్లీ లాంటి వాళ్లు టెస్టుల్లో శాతకాల మీద శతకాలు బాదొచ్చు.. కానీ, దానికి బలమైన పునాది మాత్రం పుజారానే! మాజీ రంజీ ఆటగాడు అరవింద్ కుమారుడే చటేశ్వర్ పుజార. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన పుజారకు చిన్నతనం నుంచే క్రికెట్‌పై మక్కువ ఉండేది.

# రెండు స్వర్ణాలూ మనవే



షిమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా చాంపియన్‌షిప సీనియర్, జూనియర్ విభాగాల్లో భారత షూటర్ల జోరు కొనసాగుతోంది. ఆదివారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3-పీ సీనియర్, జూనియర్ విభాగాల స్వర్ణ పతకాలు రెండూ మనోళ్లే కొల్లగొట్టారు. సీనియర్ పురుషుల 50 మీ. రైఫిల్ 3-పీ విభాగం తుది పోరులో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ టోమర్ 462.5 పాయింట్లతో పసిడి అందుకున్నాడు. చైనా, జపాన్ రజత, కాంస్యాలు నెగ్గాయి. అంతకుముందు..ఐశ్వరీ ప్రతాప్, చెయిన్ సింగ్, షెరాన్ త్రయం 50 మీ. రైఫిల్ త్రీ పొజిషన్స్ టీమ్ విభాగంలో రజత పతకం చేజిక్కించుకుంది. జూనియర్ పురుషుల 50 మీ. రైఫిల్ 3-పీ కేటగిరీ ఫైనల్లో అడ్రియన్ కర్మాకర్ (463.8) ఆసియా రికార్డుతో స్వర్ణం సొంతం చేసుకున్నాడు. హాన్ (చైనా) రజతం, వేదాంత్ నితిన్ (భారత్) కాంస్య పతకాలు సాధించారు. వేదాంత్, అడ్రియన్, రోహిత్‌తో కూడిన భారత జట్టు 50 మీ. రైఫిల్ 3-పీ టీమ్ పసిడి పతకం నెగ్గింది.

టుడే బిజినెస్

# టెక్ ఏఐకు భారత్ అద్భుత మార్కెట్





న్యూఢిల్లీ: టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఏఐ)కు భారత్ అద్భుతమైన మార్కెట్ అని మైక్రోసాఫ్ట్ ఇండియా భావిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వచ్చే ఏడాది లేదా ఏడాదిన్నరలో నూటికి 82 కంపెనీలు తమ ఉద్యోగులకు ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతుంటే, భారత్‌లో మాత్రం 93 శాతం కంపెనీలు ఇందుకు సిద్దంగా ఉన్నట్టు సంస్థ ప్రెసిడెంట్ పునీత్ చందోక్ చెప్పారు. ఈ గిరాకీని తట్టుకునేందుకు పెద్దసంఖ్యలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, అప్లికేషన్స్ ఇంజనీర్లు అవసరమవుతారన్నారు. ప్రస్తుతం మైక్రోసాఫ్ట్ కోడింగ్‌లో 30 శాతం ఏఐ ద్వారానే రాస్తున్నట్టు తెలిపారు. భారత్‌లో తమ వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐలో 300 కోట్ల డాలర్లు పెట్టుబడి పెడుతున్నట్టు తెలిపారు.ఏఐపై అనవసర భయాలు: ఏఐతో ఉద్యోగాలు పోతాయన్న భయాలను చందోక్ తోసిపుచ్చారు. కొన్ని ఉద్యోగాలు పోయినా, ఏఐ ఆర్కెస్ట్రేటర్, ఏఐ ఏజెంట్ మేనేజర్, ఏజెంట్ బాస్, ప్రాంప్ట్ ఇంజనీర్ వంటి అనేక కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయన్నారు. అయితే ఇందుకు అవసరమైన పూర్తి స్థాయి ఏఐ నైపుణ్యాలను యువత అలవర్చుకోక తప్పదన్నారు. ట్రంప్ టారిఫల ప్రభావంపై అడిగిన ప్రశ్నకు మాత్రం చందోక్ నేరుగా సమాధానం ఇవ్వలేదు. అయితే ఆర్థిక సంబంధాలు ప్రపంచ పురోగతికి దోహదం చేస్తాయన్నారు. ఐదేళ్లలో భారత్‌లో కోటి మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వాలనే లక్ష్యానికి మైక్రోసాఫ్ట్ ఇండియా కట్టుబడి ఉన్నట్టు తెలిపారు.

# టెక్ వ్యూ 25,000 వద్ద పరీక్ష

నిఫ్టీ గత వారం మానసిక అవధి 25,000 వరకు వెళ్లినా అక్కడ నిలదొక్కుకోలేకపోయింది. శుక్రవారంనాడు ఏర్పడిన బలమైన రియాక్షన్‌తో ఆ స్థాయి కన్నా దిగజారింది. వారం మొత్తానికి 240 పాయింట్ల లాభంతో 24,870 వద్ద వారం కనిష్ఠ స్థాయికి చేరువలో ముగిసింది. గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తతకు ఇది సంకేతం. మార్కెట్లో ప్రధాన ట్రెండ్ ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉంది. అయితే మిడ్‌క్యాప్-100 సూచీ 1125 పాయింట్లు లాభపడి 57,630 వద్ద స్మాల్‌క్యాప్-100 సూచీ 370 పాయింట్ల లాభంతో 17,920 వద్ద ముగిశాయి. ట్రెండ్‌లో సానుకూలత కోసం తదుపరి నిరోధాల వద్ద బలంగా నిలదొక్కుకోవాల్సి ఉంది. అమెరికన్ మార్కెట్లో గత శుక్రవారం నాటి ర్యాలీ కారణంగా ఈ వారం మన మార్కెట్ పాజిటివ్‌గానే ప్రారంభం కావచ్చు.

%బుల్లిష్ స్థాయిలు: గరిష్ఠ స్థాయిల్లో మరింత కన్సాలిడేషన్ ఉండవచ్చు. మార్కెట్ ఈ వారంలో స్వల్పకాలిక నిరోధం, మానసిక అవధి 25,000 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించాలంటే ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఆ పైన ప్రధాన నిరోధం 25,250.బేరిష్ స్థాయిలు: 25,000 వద్ద విఫలమైతే మరింత బలహీనపడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయి 24,850. ఇక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనపడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 24,500.బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారంలో 56,000 స్థాయిని బ్రేక్ చేసినా శుక్రవారం నాటి బలమైన రియాక్షన్ కారణంగా వారం మొత్తానికి 190 పాయింట్ల నష్టంతో 55,150 వద్ద ముగిసింది. ప్రధాన మద్దతు స్థాయి 55,000 కన్నా పైనే ఉంది. తదుపరి నిరోధం 55,700 కన్నా పైన నిలదొక్కుకుంటే పాజిటివ్ సంకేతం ఇస్తుంది. తదుపరి ప్రధాన నిరోధం 56,200.

# ఆర్‌కామ్‌ది మోసపూరిత ఖాతానే బీఓఐ



న్యూఢిల్లీ: అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) రుణ ఖాతాను బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) కూడా మోసపూరిత ఖాతాగా ప్రకటించింది. ఆర్‌కామ్ వ్యాపార విస్తరణ పేరుతో 2016 ఆగస్టులో అనిల్ అంబానీ తమ నుంచి తీసుకున్న రూ.700 కోట్లను దారి మళ్లించి జేబులో వేసుకున్నట్టు బీఓఐ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. ఆర్‌కామ్ రుణ ఖాతాను ఎస్‌బీఐ ఈ ఏడాది జూన్‌లోనే మోసపూరిత ఖాతాగా ప్రకటించింది. కాగా తమ నుంచి తీసుకున్న రూ.700 కోట్ల రుణ మొత్తాన్ని ఆర్‌కామ్ నిబంధనలకు విరుద్ధంగా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిందని బీఓఐ పేర్కొంది. మరోవైపు అనిల్ అంబానీపై సీబీఐ నమోదు చేసిన కేసుల ప్రభావం తమ వ్యాపారాలు, ఆర్థిక లావాదేవీలు, వాటాదారులు, ఉద్యోగులపై ఏ మాత్రం ఉండదని రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రా ప్రకటించాయి.

# స్వల్పంగా తగ్గిన బంగారం, వెండి ధరలు..

## నగరాల వారీగా రేట్లు




దేశంలో బంగారం, వెండి ధరలు లక్ష రూపాయల స్థాయి నుంచి దిగి రావడం లేదు. గత కొన్ని రోజులుగా హెచ్చు తగ్గులకు లోనవుతున్నాయి. ఈ క్రమంలో ఆగస్టు 25న గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఉదయం నాటికి బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి %ఈ నేపథ్యంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.10 తగ్గి రూ.1,01,610కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.93,140 వద్ద నిలిచింది. ఇదే సమయంలో వెండి ధరలు కూడా స్వల్పంగా తగ్గాయి. కిలో వెండి ధర రూ.100 తగ్గి రూ.1,19,900కు చేరుకుంది.దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు స్థానిక డిమాండ్, సరఫరా, మార్కెట్ పరిస్థితుల ఆధారంగా మారుతుంటాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.93,140గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,01,610గా నమోదైంది. విజయవాడలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.93,140, 24 క్యారెట్ల ధర రూ.1,01,610గా ఉంది.విశాఖపట్నంలో 22 క్యారెట్ల బంగారం రేటు రూ.93,140, 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,01,610గా కలదు. ఇక బెంగళూరులో 22 క్యారెట్ల బంగారం ధర రూ.93,140 కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,01,610గా ఉంది. చెన్నైలో కూడా 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.93,140గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం రూ.1,01,610గా నమోదైంది.వెండి ధరలు కూడా బంగారంతో పాటు స్వల్పంగా తగ్గాయి. ఈ క్రమంలో కిలో వెండి ధర రూ.100 తగ్గిపోయి రూ.1,19,900కు చేరుకుంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1,29,900గా ఉండగా, విజయవాడలో రూ.1,29,900, విశాఖపట్నంలో కేజీ వెండి రూ.1,29,900గా నమోదైంది. బెంగళూరులో కిలో వెండి రూ.1,19,900, చెన్నైలో కేజీ వెండి రూ.1,29,900గా ఉంది. ఢిల్లీ, ముంబయిలో కూడా కేజీ వెండి రేటు రూ.1,19,900 స్థాయిలో కలదు. అయితే స్థానిక మార్కెట్ పరిస్థితుల ఆధారంగా ధరలు మారవచ్చు.బంగారం, వెండి ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్, డాలర్ విలువ, ద్రవ్యోల్బణం, భౌగోళిక రాజకీయ పరిస్థితులపై ఆధారపడి మారుతుంటాయి. గత కొన్ని రోజులుగా బంగారం ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. ఆగస్టు 20న 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,00,150గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం రూ.91,800గా ఉండేది. అంటే గత ఐదు రోజుల్లోనే దాదాపు 1460 రూపాయలు పెరిగింది.

# ఫార్మా ఎగుమతుల్లో 5 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: అనిశ్చిత పరిస్థితుల్లోనూ భారత ఫార్మా ఎగుమతులు పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో భారత్ నుంచి 757 కోట్ల డాలర్ల (సుమారు రూ.65,860 కోట్లు) విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 5.21 శాతం ఎక్కువ. ఫార్ములేషన్లు, బయోలాజిక్స్ విభాగాలు ఎగుమతులు పెరిగేందుకు బాగా దోహదం చేశాయి. కాగా ఇదే కాలంలో విదేశాల నుంచి మన దేశానికి దిగుమతయ్యే ఫార్మా ఉత్పత్తులు 4.21 శాతం పెరిగి 78.6 కోట్ల డాలర్లకు చేరినట్టు ఫార్మెగ్జిల్ చైర్మన్ నమిత్ జోషి చెప్పారు. జూన్ త్రైమాసికంలో భారత్‌కు దిగుమతైన ఫార్మా ఉత్పత్తుల్లో 46 శాతం బల్క్ డ్రగ్స్, ఇంటర్మీడియరీలు ఉన్నాయి. అమెరికా మార్కెట్లో ధరల ఒత్తిడి, టారిఫ్ సమస్యలు ఉన్నా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మిగతా త్రైమాసికాల్లోనూ ఎగుమతుల వృద్ధి రేటు కొనసాగుతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2024-25) లో భారత్ నుంచి 3,047 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.65 లక్షల కోట్లు) విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 9.39 శాతం ఎక్కువ.

# ఆచితూచి వ్యవహరించండి



దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశం కనిపిస్తోంది. సెప్టెంబరులో యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం ఉండటం, జీఎస్‌టీ సంస్కరణలు సూచీలకు దన్నుగా నిలిచే వీలుంది. అయితే ట్రంప్ టారిఫ్స్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధ విరమణపై స్పష్టత లేకపోవటం సూచీలపై ప్రభావం పడే అవకాశం ఉంది. వీటిని దృష్టిలో ఉంచుకుని ఇన్వెస్టర్లు ఎంపిక చేసుకున్న షేర్లలో పెట్టుబడులు పెట్టడం మంచిది. నిఫ్టీ గత శుక్రవారం 200 పాయింట్లకు పైగా పతనమవ్వటం లాభాల స్వీకరణను సూచిస్తోంది. మద్దతు లభిస్తే మళ్లీ పుల్‌బ్యాక్ ర్యాలీకి అవకాశం ఉంటుంది.

ఎన్ఎసడీఎల్: కొన్ని రోజుల కిందే స్టాక్ మార్కెట్లో లిస్టయిన ఈ షేరు మెరుగ్గా రాణిస్తోంది. ఐపీఓ గరిష్ఠ స్థాయి తర్వాత షేరు టైట్‌గా చలిస్తోంది. ఫ్లాగ్ స్ట్రక్చర్ కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.1,275 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,450 టార్గెట్ ధరతో రూ.1,250 స్థాయిలో అక్యుములేట్ చేసుకుంటూ పడే కొద్ది కొనుగోలు చేయాలి. రూ.1,210 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.ఎక్సైడ్ ఇండస్ట్రీస్: కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో సాగుతూ వస్తున్న ఈ షేరు ప్రస్తుతం రివర్సల్ అవుతోంది. హయ్యర్ హై ఫామ్ చేస్తూ అక్యుములేషన్ జోన్‌లో ఉంది. బ్యాటరీ ఇండస్ట్రీ బ్రెడ్త్ సైతం మెరుగవుతోంది. స్వల్ప, మధ్యకాలిక మూమెంటమ్ బాగుంది. గత శుక్రవారం రూ.396 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.380/390 శ్రేణిలో ఎంటరై రూ.455 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.370 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.సుప్రీమ్ ఇండస్ట్రీస్: గత ఏడాది జూన్ నుంచి డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ కౌంటర్ ఈ ఏడాది మే నుంచి రివర్సల్ బాట పట్టింది. ప్రస్తుతం కీలక నిరోధ స్థాయి రూ.4,700 వద్ద చలిస్తోంది. దీన్ని అధిగమిస్తే మరింత పెరగటం ఖాయం. మూమెంటమ్ క్రమంగా మెరుగవుతోంది. గత శుక్రవారం రూ.4,637 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.4,600 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.4,780 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,560 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.ఇప్కా ల్యాబ్స్: కొన్ని నెలలుగా అక్యుములేషన్ జోన్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం కీలక మద్దతు స్థాయి రూ.1,350 నుంచి రివర్సల్ అయ్యింది. డార్వాస్ బాక్స్ మాదిరిగా కొంతమేర స్వింగ్ లభించే సూచనలు ఉన్నాయి. గత శుక్రవారం రూ.1,418 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,400 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,580/1,650 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,360 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.ఆదిత్య ఇన్ఫోటెక్: కొన్ని రోజుల క్రితమే మార్కెట్లో లిస్టయిన ఈ షేరు దూకుడు మీద ఉంది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006